RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY
తెలుగు దినపత్రిక

| మల్కాజిగిరి | సంపుటి : 3 | సంచిక : 201 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ | మంగళవారం, ఫిబ్రవరి, 3, 2026 | పేజీలు : 8 వెల : రూ.4/- |
|---|---|---|---|---|---|
| MALKAJGIRI | VOLUME : 3 | ISSUE NO : 201 | EDITOR : MERUGU CHANDRAMOHAN | Tuesday, February, 3, 2026 | PAGES : 8 RS : 4 /- |




### అమెరికా నుంచి హైదరాబాద్ చేరుకున్న

## రేవంత్ రెడ్డి

- ఘన స్వాగతం పలికిన ఎమ్మెల్యే నవీన్ యాదవ్, ఇతర నేతలు
- అమెరికాలో లీడర్ షిప్ కోర్సు పూర్తి చేసిన రేవంత్

**హైదరాబాద్,తెలంగాణ దిశ:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిఅమెరికా పర్యటన ముగించుకుని హైదరాబాద్ కు చేరుకున్నా రు. నిన్న రాత్రి 2.50 గంటలకు శంషాబాద్ ఎయిర్ పోర్ట్ లోఆయనల్యాండ్ అయ్యారు. ఎమ్మెల్యే నవీన్ యాదవ్ తోపాటు పలువురు నేతలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. పూలమాల వేసి, శాలువాలతో ఘనంగా సన్మానిం చారు. స్విట్జ ర్లాండ్ లోని దావోస్ లో జరిగిన వరల్డ్ ఎకనా మిక్ ఫోరంస మావేశాల్లో రేవంత్ పాల్గొన్నసంగతి తె లిసిందే. అనంతరం అక్కడి నుంచి అమెరికాకు వెళ్లారు. హార్వర్డ్ యూనివర్సిటీలోని కెన్నెడీ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్ లో ఆయన లీడర్ షిప్ కోర్సు పూర్తి చేశారు. జనవరి 25 నుంచి 30 వరకు జరిగిన లీడర్ షిప్ ఫర్ ట్వెంటీ ఫస్ట్ సెంచరీ పేరిట నిర్వహించిన తరగతులకు ఆయన హాజరయ్యారు.



### కాంగ్రెస్ ప్రభుత్వానికి సుప్రీంలో

## ఎదురుదెబ్బ

### సోషల్ మీడియా పోస్టులపై అప్పీల్ తిరస్కరణ

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి2 :** కాంగ్రెస్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో మరోసారి ఎదురుదెబ్బ తగలింది. సామాజిక మాధ్యమాల పోస్టులపై రాష్ట్ర ప్రభుత్వం అడ్డగోలుగా కేసులు పెట్టడం ఏ మాత్రం చెల్లదంటూ గతంలో హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం చేసిన అప్పీల్‌ను అత్యున్నత ధర్మాసనం తిరస్కరించింది. సోషల్ మీడియా పోస్టులపై అక్రమ కేసులు పెట్టడం ఏమాత్రం చెల్లదని గత ఏడాది సెప్టెంబర్‌లో హై కోర్టు సంచలన తీర్పును ఇచ్చింది. రాజ్యాంగం లోని ప్రాథమిక హక్కులతో పాటు చట్టాల స్ఫూర్తితోనే పోలీసులు పని చేయాలని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ తీర్పు అప్రజాస్వామిక పద్ధతులతో సోషల్ మీడియా యాక్టివిస్టులను అణచివేయాలని చూస్తున్న ప్రభుత్వానికి ఒక హెచ్చరికగా మారింది. ఒక ట్వీట్ చేసినందుకు సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసినందుకు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా పోస్టులు చేసినందుకు కేసులు పెడతామంటే చెల్లదని, కేసులు పెట్టే ప్రతి వ్యక్తి ఏ విధంగా తనకు వ్యక్తిగతంగా నష్టం జరిగిందో చెప్పాల్సిన అవసరం బాధ్యత ఉంటుందని అప్పుడే ఎఫ్ఐఆర్లు నమోదు చేయాలని కఠినమైన ఆదేశాలను మార్గదర్శకాలను జారీ చేసింది.



## కేసీఆర్ భావోద్వేగం..

### అప్పుడు అస్థిత్వం..
### ఇప్పుడు విచారణలా..!

**హైదరాబాద్, ఫిబ్రవరి 2,తెలంగాణ దిశ :** తెలంగాణ రాజకీయ ముఖచిత్రం ఒక్కసారిగా వేడెక్కింది. గత పదేళ్లు రాష్ట్రాన్ని శాసించిన మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు నందినగర్ నివాసంలో సిట్ అధికా రుల విచారణను ఎదుర్కొన్నారు. కేవలం విచారణే కాదు, అక్కడ చోటుచేసు కున్న పరిణామాలు, కేసీఆర్ వ్యక్తం చేసిన భావోద్వేగాలు ఇప్పుడు రాష్ట్రవ్యాప్త ంగా చర్చనీయాంశమయ్యాయి. విచారణ ప్రారంభానికి ముందు కేసీఆర్ తీవ్ర భావోద్వేగానికి లోనైనట్లు తెలుస్తోంది.

మధ్యాహ్న భోజన సమయంలో తన సన్నిహితుల వద్ద ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీశాయి. నందినగర్‌లోని కేసీఆర్ నివాసం తెలంగాణ ఉద్యమ కాలంలో కీలక నిర్ణయాలకు వేదిక. "స్వరాష్ట్ర సాధన కోసం ఇదే గదిలో ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపాను. వ్యూహాలు రచించాను. అలాంటి పవిత్రమైన చోట నేడు నేరారోపణలపై విచారణ ఎదుర్కోవాల్సి రావడం బాధాకరం"అని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. "తెలంగాణ అస్థిత్వం కోసం పోరాడిన గదిలో.. ఇప్పుడు అదే రాష్ట్రంలో విచారణ ఎదుర్కోవడం కాలం చేసిన వింత క్రీడ." అని రాజకీయ విశ్లేషకుల అభిప్రాయ పడుతున్నారు.

## గ్యారెంటీల పేరుతో ఓట్లు దండుకున్న కాంగ్రెస్

### ఛార్జ్‌షీట్ విడుదల చేసిన బిజెపి చీఫ్ రామచంద్రరావు

**హైదరాబాద్,ఫిబ్రవరి,2 ,తెలంగాణ దిశ :** గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ ఓట్లు దండుకున్నదే కానీ ప్రజలకు చేసిందేమీ లేదని తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు విమర్శించారు. ఈ మేరకు రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై రాంచందర్ రావు నిప్పులు చెరిగారు. సోమవారం హైదరాబాద్‌లోని హోటల్ పీపుల్స్ ప్లాజాలో 'బూటకపు హామీలు - మోసపూరిత వాగ్దానాలు' అంటూ కాంగ్రెస్ అరాచక, అవినీతి పాలనపై తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు ఛార్జ్‌షీట్ విడుదల చేశారు.





### కెసిఆర్‌కు మద్దతుగా బిఆర్ఎస్

## ఆందోళనలు

### కార్యకర్తలకు కెటిఆర్ కృతజ్ఞతలు

**హైదరాబాద్, ఫిబ్రవరి2,తెలంగాణ దిశ :** ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను సిట్ విచారణకు పిలువడాన్ని నిరసిస్తూ ఆదివారం రాష్ట్రవ్యాప్త ంగా ఆందోళనలు జరిగాయి. గ్రామ గ్రామాన బీఆర్ఎస్ శ్రేణులు తమ అధినేతకు మద్దతు గా కదం తొక్కారు. కార్యకర్తలు ఎక్కడికక్కడ సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు.

- దోషులు ఎవరో తేల్చాల్సి ఉంది
- ఎవరిపైనా కక్షసాధింపు చర్యలు లేవు
- మంత్రి శ్రీధర్ బాబు స్పష్టీకరణ



### ఫోన్ ట్యాపింగ్ దుశ్చర్యలు

## బయటపడాల్సిందే

**హైదరాబాద్,ఫిబ్రవరి2,తెలంగాణ దిశ:** ఫోన్ ట్యాపింగ్ కేసుపై తెలం గాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు సోమవారం హైదరా బాద్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. చట్టం తన పని తాను చేస్తుందని స్పష్టం చేశారు. భార్యాభర్తల సంభా షణలు వినే దుశ్చర్యకు పాల్పడితే విచారణ జరపాలా వద్దా అని ప్రశ్నించారు. తప్పుచేసి మాపైనే అభియోగాలు మోపుతున్నారని ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ రెడ్డికి ఎవరి మీదా కక్ష సాధింపు ఆలోచన లేదని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం రాష్ట్రానికి చెడ్డపేరు తెచ్చిందన్నారు. సాధారణంగా ఉగ్రవాదులు, ఆటంకవాదుల ఫోన్లను ట్యాప్ చేస్తారని.. కానీ ఇక్కడ నాయకులు, జడ్జిలు, వ్యాపారవేత్తల ఫోన్లనే ట్యాప్ చేశారని చెప్పారు. ఆధారాలు లభించిన నేపథ్యంలో విచారణ జరుగుతోందని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ ఎవరు చేశారు? ఎందుకు చేశారో.? తేల్చాల్సిన బాధ్యత తమ ప్రభుత్వంపై ఉందని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు.



### మేడారం జాతర

## విజయవంతం

### ఊహించిన దానికన్నా పెరిగిన భక్తుల రాక - మంత్రి సీతక్క

**ములుగు,ఫిబ్రవరి2,తెలంగాణ దిశ:** మేడారం సమక్క-సారక్క అమ్మవార్ల మహా జాతర విజయవం తంఅయిందని తెలంగాణ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ(సీతక్క) పేర్కొన్నారు. జాతరకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ.. భక్తులకు చిన్నచిన్న అసౌకర్యాలు కలిగినందుకు చింతిస్తున్నామ న్నారు. వీవీఐపీల తాకిడి వల్లే ట్రాఫిక్ జామ్ అయిందని చెప్పుకొచ్చారు. సమ్మక్క-సారలమ్మ అమ్మవార్లతో తమకు భావోద్వేగ బంధం ఉందని మంత్రి సీతక్క ప్రస్తావించారు. అందుకే అన్ని జాగ్రత్త లు చేపట్టామని వివరించారు.




### మున్సిపాలిటీల్లో..

## ఎన్నికల వేడి

## బీ ఫామ్ కోసం బలప్రదర్శనలు

**అదిలాబాద్,ఫిబ్రవరి2,తెలంగాణ దిశ:** మంచిర్యాల జిల్లాలోని మంచిర్యాల కార్పొరేష న్‌తో పాటు బెల్లంపల్లి, చెన్నూర్, క్యాతనపల్లి, లక్షెట్టిపేట మున్సిపాలిటీల్లో ఎన్నికల వేడి రాజుకుంటుంది. స్క్రూటినీ అనం తరం అభ్యర్థులందరు వార్డుల వారిగా ఎంత మంది బరిలో ఉన్నారు, ఆయా పార్టీల నుంచి ఎంత మంది నామినేషన్లు వేశారు, ఇందు లో పార్టీ బీ ఫారంలు సమర్పించిన వారెందరు, ఇంకా ఎంత మందికి బీ ఫారంలు కావాలి, వారంతా ఇండిపెండెంట్లుగా బరిలో నిలబడితే వార్డులో ఏ కాలనీలోని ఎన్ని ఓట్లు చీల్చుతారు, వారిని తమవైపు తిప్పుకుంటే ఎన్ని ఓట్లు ప్లస్ అవుతాయని అభ్యర్థులు అంఛనాలు వేయడంతో పాటు సొంత పార్టీలో రెబల్ లను విత్‌డ్రా చేయించేందుకు వారి దగ్గరి బంధువులతో, స్నేహితుల తో మంతనాలు జరుపుతున్నారు. ఇప్పటి వరకు పెట్టిన ఖర్చుతో పాటు అదనంగా ఫలానా వరకు ఇస్తామని రాయబారాలు నడిపిస్తున్నారు. జిల్లాలో 149 డివిజన్, వార్డులకు 1599 నామినేషన్లు రాగా స్క్రూటినీ అనంతరం 1061 మంది అభ్యర్థులకు చెందిన 1177 నామినేషన్లు ఆమోదం పొందాయి. మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలో 60 డివిజన్లకు 362 మంది అభ్యర్థుల 386 నామినేషన్లు ఆమోదం పొందగా ఇందులో కాంగ్రెస్ నుంచి 77 నామినేషన్ లు,



### ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణపై

## కవిత కీలక వ్యాఖ్యలు

- సిట్ పిలిస్తే విచారణకు వెళతానన్న జాగృతి అధ్యక్షురాలు
- విచారణ సుదీర్ఘంగా కొనసాగడంపై విమర్శలు
- త్వరగా పూర్తిచేసి దోషులను శిక్షించాలని డిమాండ్

**హైదరాబాద్, ఫిబ్రవరి2,తెలంగాణ దిశ :** తెలంగా ణలో సంచలనం సృష్టించిన ఫోన్‌ట్యాపింగ్ కేసుపై జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. ట్యాపింగ్ వ్యవహారంలో విచారణను తొందరగా ముగించి దోషులకు శిక్ష పడేలా చేయాలని డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసును సిట్ విచారిస్తున్న విషయం తెలిసిందే. ఈ కేసులో అధికారులకు సహకరించేందుకు తాను సిద్ధమని చెప్పారు. అధికారులు పిలిస్తే తాను విచారణకు హాజరవుతానని కవిత తెలిపారు. ఈ మేరకు ఈ రోజు ఉదయం హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియాసమావేశంలో కవిత మాట్లాడుతూ.. ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ మొదలై రెండు సంవత్సరాలు గడించిందని గుర్తుచేశారు. విచారణ సుదీర్ఘంగా కొనసాగడంపై విమర్శలు గుప్పించారు. విచారణ ఇంకెప్పుడు ముగుస్తుందని,దోషులను ఎప్పుడు శిక్షిస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

# పాదచారుల భద్రతే లక్ష్యం

**- రాయదుర్గం.. టి హబ్ మార్గంలో తొలి దశ స్కై వాక్ నిర్మాణ ప్రతిపాదనలు - సైబారాబాద్ సీపీ డాక్టర్ రమేష్**



**శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 02, (తెలంగాణ దిశ) :**సైబరాబాద్ ఐటీ కారిడార్‌లో పాదచారుల భద్రత కోసం, ట్రాఫిక్ రద్దీని గణనీయంగా తగ్గించాలనే లక్ష్యంతో రాయదుర్గం మెట్రో స్టేషన్ నుంచి టీ హబ్ వరకు తొలి దశ స్కై వాక్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపనున్నారు. ఈ నేపథ్యంలో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ నేతృత్వంలో అధికారుల బృందం సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించింది. ఈ స్కైవాక్ రాయదుర్గం మెట్రో స్టేషన్ నుంచి ఐకియా ఫ్లైఓవర్, ఐటీసీఎల్ మీదుగా టీ హబ్ వరకు విస్తరించనుంది. ఐటీ కంపెనీలు, కార్యాలయాలు అధికంగా ఉన్న ఈ ప్రాంతంలో పాదచారుల రాకపోకలు ఎక్కువగా ఉండటంతో పాటు ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. స్కైవాక్ నిర్మాణంతో వాహనాల రాకపోకలు సజావుగా సాగడంతో పాటు పాదచారులు ప్రమాదాలు లేకుండా రహదారి దాటే వీలు కలగనుంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే ట్రాఫిక్ రద్దీ సుమారు 30 శాతం వరకు తగ్గే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ ప్రాజెక్టును ఎస్సీఎస్సీ సహకారంతో వివిధ సంస్థల భాగస్వామ్యంతో చేపట్టనున్నాయి. తొలి దశలో సుమారు 500 మీటర్ల పొడవు గల స్కైవాక్‌ను నిర్మించనున్నారు. అలాగే టీ హబ్ నుంచి మైండ్ స్పేస్ సీ గేట్ వరకు సుమారు 400 మీటర్ల పొడవైన అండర్‌పాస్ టన్నెల్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీ (ఐఏఎల్ఏ) ద్వారా తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీజీఐఐసీ) నుంచి ప్రభుత్వానికి ఈ ప్రతిపాదనలు పంపనున్నారు. భవిష్యత్తులో ఈ స్కైవాక్‌ను ఇతర ప్రాంతాలకు విస్తరించేలా ప్రణాళికలు రూపొందించారు. ఈ పనుల పురోగతిని జీహెచ్ఎంసీ, టీజీఐఐసీ, ఐఏఎల్ఏ ఆధ్వర్యంలో సమన్వయ సమావేశాల ద్వారా క్రమం తప్పకుండా పర్యవేక్షించనున్నారు. సీపీ వెంట కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్ ఐపీఎస్, శేరిలింగంపల్లి ట్రాఫిక్ డీసీపీ రంజన్ రతన్ కుమార్, మాదాపూర్ ట్రాఫిక్ డీసీపీ సాయి కుమార్, ట్రాఫిక్ ఏడీసీపీ హనుమంతరావు, మాదాపూర్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్ రెడ్డి, మాదాపూర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ కుమార్, రాయదుర్గం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పవన్, ఎస్సీఎస్సీ సీఈవో నావెద్, రహేజా మైండ్ స్పేస్, సత్వ, దివ్యశ్రీ, ఫీనిక్స్ గ్రూప్ సంస్థల ప్రతినిధులు ఉన్నారు.




## మల్లాపూర్ డివిజన్‌లో తాగునీటి సమస్యలను పరిష్కరించాలి



**మల్లాపూర్, ఫిబ్రవరి 02, (తెలంగాణ దిశ)** ..:మల్లాపూర్ డివిజన్ పరిధిలోని కెవెల్ రెడ్డి నగర్, హెచ్‌సిఎల్ కాలనీ, భవాని నగర్ కాలనీ, అన్నపూర్ణ కాలనీ ఈస్ట్ ప్రాంతాల్లో నెలకొన్న తీవ్రమైన తాగునీటి సమస్యపై కాంగ్రెస్ పార్టీ నాయకులు జలమండలి అధికారులను ఆశ్రయించారు. కాంగ్రెస్ నాయకుడు నెమలి అనిల్ కుమార్ ఉప్పల్ కార్యాలయంలో జలమండలి జనరల్ మేనేజర్ పి. సంతోష్ కుమార్‌ను కలిసి, ఆయా ప్రాంతాల్లో తక్కువ నీటి ఒత్తిడి కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. అలాగే సమీపంలోని రసాయన పరిశ్రమల వల్ల గ్రౌండ్ బోర్ నీరు కలుషితమవుతున్న అంశంపై ప్రజల్లో ఉన్న ఆందోళనను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యను అత్యవసరంగా పరిష్కరించాలని కోరుతూ జలమండలి అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నెమలి అనిల్ మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్యం మరియు మౌలిక వసతులే కాంగ్రెస్ పార్టీకి ప్రథమ ప్రాధాన్యమని, తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే వరకు పార్టీ తరఫున నిరంతర పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ జలమండలి ఏఈ సిరాజుద్దీన్, మల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ తాండ్ర శ్రీకాంత్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మక్తాల బాల్ రాజు గౌడ్, జాయింట్ సెక్రటరీ వుండం శ్రీనివాస్, దాసరి సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జై జవాన్ కాలనీలోని పది షట్టర్లకు ఓపెన్ పబ్లిక్ ఆక్షన్ నిర్వహించాలి

### - జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్‌కు ప్రజావాణిలో వినతి



**ఏఎస్ రావునగర్, ఫిబ్రవరి 02, (తెలంగాణ దిశ)** :ఏఎస్ రావునగర్ డివిజన్ పరిధిలోని జై జవాన్ కాలనీలో ఉన్న పది కమర్షియల్ షెటర్లకు జిహెచ్ఎంసి నిబంధనల ప్రకారం ఓపెన్ పబ్లిక్ ఆక్షన్ ద్వారా కేటాయించాలని సమాచార హక్కు పరిరక్షణ సమితి కన్వీనర్ తాడూరి గగన్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిహెచ్ఎంసి కమిషనర్ తో పాటు ఉప్పల్ జోనల్ కమిషనర్ లకు ప్రజావాణి కార్యక్రమంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ 10 కమర్షియల్ షెటర్లను సుమారు 12 సంవత్సరాల క్రితం అప్పటి శాసనసభ్యులు నియోజకవర్గ అభివృద్ధి నిధులతో నిర్మించారని తెలిపారు. అయితే అప్పటి నుంచి ఇప్పటి వరకు వీటి ద్వారా రావలసిన అద్దె ఆదాయం జిహెచ్ఎంసికి దక్కకపోవడంతో నెలకు రూ.50 నుంచి రూ.60 వేల వరకు, మొత్తం దాదాపు కోటి రూపాయల మేర ఆదాయం కోల్పోయినట్లు పేర్కొన్నారు. ఈ అంశంపై తాను గత 12 సంవత్సరాలుగా పోరాటం చేస్తూ వస్తున్నానని తెలిపారు. ప్రస్తుత ప్రజా ప్రభుత్వంలో భాగంగా జిహెచ్ఎంసి అధికారులు 2025 జూన్ 04 వ తేదీన నిబంధనల ప్రకారం ఈ షట్టర్లను స్వాధీన పరచుకుని సీజ్ చేశారని తెలిపారు. అయితే అప్పటి నుంచి ఇప్పటి వరకు సుమారు అర్ధ సంవత్సరం కాలంగా షటర్స్ మూసివేయబడి ఉండటంతో జిహెచ్ఎంసికి ఆదాయం రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అదే విధంగా జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ తీర్మానం నెంబర్ 236 ప్రకారం టెండర్ ప్రక్రియ ద్వారా ఓపెన్ పబ్లిక్ ఆక్షన్ నిర్వహించాలని 2025 డిసెంబర్ 29న ఆదేశాలు జారీ అయినప్పటికీ, ఇప్పటివరకు అమలు జరగలేదని తెలిపారు.
దీనిని దృష్టిలో ఉంచుకొని జిహెచ్ఎంసి నిబంధనలలో ఉన్న రిజర్వేషన్ విధానాన్ని పాటిస్తూ, వెంటనే ఈ 10 కమర్షియల్ షటర్స్‌కు ఓపెన్ పబ్లిక్ ఆక్షన్ నిర్వహించి జిహెచ్ఎంసికి ఆదాయం సమకూర్చాలని ఆయన అధికారులను కోరారు.

## మోటకొండూర్ లో ఉత్సహాభరితంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం





భువనగిరి,ఫిబ్రవరి 02, (తెలంగాణ దిశ) :యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1990 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. పదవ తరగతి వరకు ఇక్కడ విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు వివిధ వృత్తులు,హోదాల్లో స్థిరపడ్డారు. వీరంతా ఈ కార్యక్రమానికి హాజరై తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించుకున్నారు. అప్పట్లో తమకు గురువులతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.
చదువు కునే రోజుల్లో అలనాటి జ్ఞాపకాలు, అనుభూతులను ఒకరికొకరు పంచుకొని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటడంతో పాటు ప్రస్తుత విద్యార్థుల క్రీడా అవసరాల కోసం రూ.10,000 నగదును పాఠశాల ప్రధానో పాధ్యా యుడు రఘురాం రెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమానికి పూర్వ ఉపాధ్యాయులు కొంతం అంజిరెడ్డి, పైళ్ళ కృష్ణారెడ్డి, బండ్రు రాజమల్లయ్య, అనంతుల బుచ్చిరెడ్డి, భాస్కరరావు, మధురవాణి హాజరయ్యారు. కార్యక్రమంలో దాదాపు 70 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## స్లాబ్ మీద స్లాబ్.., ఎవరూ పట్టించుకోరూ...

## నాలా కబ్జా..., చోద్యం చూస్తున్న అధికారులు..!



**ఏఎస్ రావునగర్, ఫిబ్రవరి 02, (తెలంగాణ దిశ)** :కాప్రా నాలా బఫర్ జోన్ లో అక్రమ నిర్మాణం యదేచ్ఛగా కొన సాగుతుంది. రాధిక దమ్మాయిగూడ ప్రధాన రహదారి పై రాజరాజేశ్వరి కాలనీలో నిబంధనల విరుద్ధంగా నిర్మాణాన్ని చేపడుతున్న అధికారులు చోద్యం చూస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. జిహెచ్ఎంసి జోనల్ కార్యాలయం నుంచి తీసుకున్న అనుమతుల ప్రకారం నిర్మాణం జరగడంలేదని అనేక ఆరోపణలు వెల్లువెత్తుతున్న పట్టించుకునే నాధులే కరువయ్యారు. బఫర్ జోన్ పరిధిలోని స్థలాన్ని సైతం కబ్జా చేసి నిర్మాణం చేపడుతున్న ఇటు రెవెన్యూ అటు జిహెచ్ఎంసి అధికారులు పట్టించుకోవడంలేదని సమాచార హక్కు పరిరక్షణ కమిటీ మేడ్చల్ జిల్లా కన్వీనర్ తాడూరు గగన్ కుమార్ ఆరోపించారు. రెవిన్యూ, జిహెచ్ఎంసి, నీటిపారుదల శాఖ అధికారుల మధ్య సమన్వయ లోపంతో అక్రమ నిర్మాణం యదేచ్ఛగా కొనసాగుతుంది. నిర్మాణం సక్రమంగా జరగడం లేదంటూ రెవెన్యూ వర్గాలు ప్రాథమికంగా ధ్రువీకరించి గతంలో రెండుసార్లు కూల్చివేసిన విషయం విదితమే. ఈ మేరకు రెవెన్యూ అధికారులు జిహెచ్ఎంసి, నీటిపారుదల శాఖ అధికారులకు లేఖలు రాసి చేతులు జరుపుకున్నారు. నీటిపారుదల శాఖ అధికారులు హైడ్రాకు లేఖ రాశారు. భవన నిర్మాణ వివాదం కోర్టులో కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో కోర్టు తీర్పు ఆసక్తికరంగా మారనుంది. మరోవైపు జిహెచ్ఎంసి అధికారులు జిహెచ్ఎంసి పునర్విభజన వ్యవహారాలలో తలమునుకలై ఉన్నారు. ఈ అక్రమ నిర్మాణంపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేసి చూడాల్సిందే.

## ఆటోల ద్వారా ప్రతి ఇంటిలో చెత్తను సేకరించాలి

### - శానిటేషన్ తనిఖీల్లో భాగంగా గ్రీన్ హిల్స్ కాలనీలో అదనపు కమిషనర్ల పరిశీలన





**కాప్రా, ఫిబ్రవరి 02, (తెలంగాణ దిశ):**ఆటోల ద్వారా ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించాలని జిహెచ్ఎంసి అదనపు కమిషనర్లు వినయ్ కృష్ణారెడ్డి, శానిటేషన్ అదనపు కమిషనర్ రఘు ప్రసాద్ లు సూచించారు సోమవారం శానిటేషన్ పనుల పర్యవేక్షణలో భాగంగా గ్రీన్ హిల్స్ కాలనీలో పర్యటించారు ఈ సందర్భంగా కాలనీవాసులతో మాట్లాడారు. ఇంటింటి చెత్త సేకరణ పరిస్థితులు, చెత్త ఎక్కువగా పడే చెత్త హాని కలిగించే పాయింట్లు(జీవీపీల)వివరాలు, జీవీపీల ఎలిమినేషన్ చర్యలపై అధికారులు సమీక్షించారు. ఈ సందర్భంగా ఓల్డ్ మున్సిపల్ ఆఫీస్ మజీద్ ఎదురుగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు విత్ మైక్‌ల పనితీరును పరిశీలించారు. శానిటేషన్ ఫీల్డ్ అసిస్టెంట్ (ఎస్ఎఫ్ఏ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటింటి చెత్త సేకరణ సర్వేలో భాగంగా గ్రీన్ హిల్స్ కాలనీలో ఇంటి యజమానులతో అధికారులు ముఖాముఖి మాట్లాడి, చెత్త సేకరణపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ తనిఖీల్లో భాగంగా స్వచ్ఛ ఆటోల అటెండెన్స్‌ను ప్రతి రోజూ పరిశీలించాలని అధికారులను ఆదేశించారు ప్రతి ఇంటికి తప్పనిసరిగా చెత్త సేకరణ ఆటో వెళ్లేలా చర్యలు తీసుకోవాలని, సంబంధిత అధికారులను అదనపు కమిషనర్లు ఆదేశించారు.

## ఘనంగా రేణుక ఎల్లమ్మ తల్లి కళ్యాణం



**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 02, (తెలంగాణ దిశ)** :కుత్బుల్లాపూర్ నియోజక వర్గ పరిధిలోని భౌరంపేట్ లో శ్రీరేణుక ఎల్లమ్మ తల్లి కళ్యాణం, మల్లన్న స్వామి కళ్యాణం జాతర ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు స్థానిక మాజీ శాసనసభ్యులు శ్రీశైలం గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై రేణుక ఎల్లమ్మ, మల్లన్న స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ కమిటీ వారు శాలువాతో సత్కరించారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆ రేణుక ఎల్లమ్మ తల్లి, మల్లన్న స్వామి ఆశీస్సులు, దీవెనలు నియోజకవర్గ ప్రజలందరి పై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పద్మా రెడ్డి, వెంకటేష్ యాదవ్, యాదవ రెడ్డి, నాగరాజ్ యాదవ్, మల్లేష్ ముదిరాజ్, బల్వంత్ రెడ్డి, జంగారెడ్డి, మాజీ కౌన్సిలర్ పీసరి కృష్ణారెడ్డ బొంగునూరి ప్రభాకర్ రెడ్డి మరియ కూన రఘు, ప్రభాకర్ రెడ్డి, జైరాం తదితరులు పాల్గొన్నారు.



## కుషాయిగూడ భవానినగర్ లో చోరీ

### - బంగారు, వెండి ఆభరణాలు అపహరణ





**కుషాయిగూడ, ఫిబ్రవరి 02, (తెలంగాణ దిశ) :**కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని భవాని నగర్ రోడ్డు నెంబర్ 3లోని ఓ ఇంటిలో ఆదివారం అర్ధరాత్రి దొంగతనం జరిగింది. బాధితుడు కొలుకుల వెంకట సుబ్బారావు తెలిపిన వివరాల ప్రకారం ఆయన జనవరి 30న తన భార్య విజయదుర్గ, పిల్లలు మాధవన్ (18), భాని శంకర్ (10), అత్త శకుంతల (85)తో కలిసి స్వగ్రామమైన మాచర్లకు వెళ్లారు. ఫిబ్రవరి 2వ తేదీ తెల్లవారుజామున సుమారు 12.30 గంటలకు ఇంటికి తిరిగి వచ్చేసరికి ప్రధాన ద్వారం తాళం పగిలి ఉండటాన్ని గమనించారు. ఇంట్లోకి ప్రవేశించగా రెండు బెడ్‌రూమ్‌ల తలుపులు తెరిచి ఉండగా, ఒక గదిలోని అల్మారా తెరిచి అందులో ఉన్న వస్తువులను మంచంపై పడేసి ఉంచారు. అల్మారాను పరిశీలించగా అందులో భద్రపరిచిన బంగారు, వెండి ఆభరణాలు, నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. చోరీకి గురైన వస్తువుల్లో సుమారు 30 గ్రాముల బంగారు గొలుసులు, 5 గ్రాముల బంగారు చెవిపోగులు, 5 గ్రాముల బంగారు ఉంగరం, 4 గ్రాముల లక్ష్మీ రూపులు, వెండి వస్తువులు, కొంత నగదు ఉన్నట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎవరో తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి దొంగతనం చేసినట్లు అనుమానిస్తున్న బాధితుడు కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# సంపాదకీయం

## హెరాల్డ్ రగడ..!

దేశ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారి తీసిన అంశాల్లో నేషనల్ హెరాల్డ్ కేసు ఒకటి. కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలను లక్ష్యంగా చేసుకుని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ద్వారా బీజేపీ రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆ పార్టీ ఆరోపణలు చేసింది. ఢిల్లీలోని రోజ్ అవెన్యూ కోర్టు కేసు విచారణ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేసింది. ఒక ప్రైవేటు వ్యక్తి చేసిన ఫిర్యాదు ఆధారంగా ఈడీ దాఖలు చేసిన చార్జ్‌షీట్‌ను పరిగణలోకి తీసుకోలేమని కోర్టు తెలిపింది. పీఎంఎల్ఏ చట్టం ప్రకారం మనీలాండరింగ్ కేసు కొనసాగడానికి షెడ్యూల్డ్ ఆఫెన్స్ (అంతర్లీన నేరం) ఆధారంగా ఎఫ్ఐఆర్ ఉండాలని కోర్టు స్పష్టం చేసింది. ఇది కాంగ్రెస్‌కు ఊరట కలిగించే అంశమైనప్పటికీ, కోర్టు నిర్ణయాన్ని ఈడీ సవాల్ చేసే అవకాశముంది. గత నవంబర్‌లో ఈడీ సమాచారం ఆధారంగా ఢిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. మరోవైపు రాహుల్‌పై కక్ష సాధింపు చర్యలను వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ శ్రేణులు దేశవ్యాప్త ఆందోళనలకు పిలుపునివ్వడం ప్రాముఖ్యతను సంతరించుకుంది.నేషనల్ హెరాల్డ్ కేసు నేపథ్యం ఒకసారి పరిశీలిద్దాం. 1938లో నేషనల్ హెరాల్డ్ వార్తా పత్రికను జవహర్‌లాల్ నెహ్రూ ప్రారంభించారు. అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఏజేఎల్) అనే సంస్థ ఈ పత్రికను ప్రచురించేది. 1942లో బ్రిటీష్ ప్రభుత్వం నేషనల్ హెరాల్డ్ పత్రికను నిషేధించింది. 1945లో తిరిగి ప్రారంభమైన నేషనల్ హెరాల్డ్ పత్రికను ఆర్థిక కారణాలతో 2008లో మూసేయాల్సి వచ్చింది. నేషనల్ హెరాల్డ్‌ను మూసే సమయానికి ఏజేఎల్ సంస్థకు కాంగ్రెస్ పార్టీ రూ. 90 కోట్ల మేర బకాయి పడినట్లు సమాచారం. 2012లో బీజేపీ నేత సుబ్రమణియన్ స్వామి ఢిల్లీలోని స్థానిక ట్రయల్ కోర్టులో గాంధీ కుటుంబం మీద కేసు వేశారు. ఏజేఎల్ సంస్థకు చెందిన 2 వేల కోట్ల రూపాయలకు పైగా ఆస్తులను హస్తగతం చేసుకోవడం కోసం, ఆ సంస్థను తమ యాజమాన్యంలోకి తెచ్చుకోవటానికి కాంగ్రెస్ పార్టీ నిధులను ఉపయోగించుకుందని ఆయన ఆరోపించారు. సుబ్రమణియన్ ఫిర్యాదు ఆధారంగా ఈడీ మనీలాండరింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది.నేషనల్ హెరాల్డ్ పత్రికను ప్రచురించే ఏజేఎల్‌కు కాంగ్రెస్ పార్టీ రూ.90 కోట్లకు పైగా వడ్డీలేని రుణం ఇచ్చిందని ఈడీ పేర్కొంది. ఆ రుణాన్ని రాహుల్ గాంధీ, సోనియా గాంధీలకు... మెజార్టీ వాటాలు ఉన్న యంగ్ ఇండియన్ లిమిటెడ్ (వైఐఎల్) సంస్థ ద్వారా రూ.50 లక్షలు మాత్రమే చెల్లించి.. ఏజేఎల్‌కు చెందిన సుమారు రూ. 2 వేల కోట్లు సొంతం చేసుకున్నారని ఈడీ ఆరోపించింది. ఇది మనీలాండరింగ్ చర్య కిందకు వస్తుందంటూ ఈడీ 2025 ఏప్రిల్‌లో చార్జ్‌షీట్ దాఖలు చేసింది. కాగా ఈ కేసు దశాబ్దకాలంగా రాజకీయ వివాదంగా మారింది.నేషనల్ హెరాల్డ్ పత్రిక స్వాతంత్ర్యోద్యమంతో ముడిపడి ఉండటం, దాని ఆస్తులు ఢిల్లీ, ముంబై, లక్నోల్లో ఉండటంతో వివాదం మరింత ముదిరింది. కాంగ్రెస్ నాయకులు ఇది పత్రికను పునరుజ్జీవింపజేయడానికి చేసిన ప్రయత్నమని వాదిస్తుంటే, ఇది ఆస్తుల దుర్వినియోగమని ఈడీ ఆరోపిస్తోంది. తాజా కోర్టు నిర్ణయంతో సోనియా, రాహుల్‌లకు ఊరట లభించినప్పటికీ, కేసు పూర్తిగా ముగిసినట్టు కాదు. భవిష్యత్తులో మరిన్ని పరిణామాలు జరగవచ్చు.బ్లాక్ మనీని (చట్ట వ్యతిరేకంగా, అక్రమ మార్గాల ద్వారా సంపాదించిన డబ్బు)ను వైట్ మనీగా (చట్టబద్ధంగా) మార్చే ప్రక్రియనే మనీ లాండరింగ్ అని అంటారు. అక్రమ మార్గాల ద్వారా సంపాదించిన లేదా ఆదాయానికి మించి సమకూరిన సంపాదనను బ్లాక్ మనీ అని అంటారు.మనీ లాండరింగ్‌లో వివిధ దశలను, చోటు చేసుకునే విధానాన్ని బెంగళూరుకు చెందిన ఒక కార్పొరేట్ సంస్థలో యాంటీ మనీ లాండరింగ్ విభాగానికి నేతృత్వం వహిస్తున్న బిపిన్ నాయిర్ బీబీసీకి వివరించారు.మనీ లాండరింగ్ ప్లేస్‌మెంట్, లేయరింగ్, ఇంటెగ్రేషన్ అనే మూడు దశల్లో జరుగుతుంది.చట్ట వ్యతిరేకంగా సేకరించిన డబ్బును ఆర్థిక వ్యవస్థలోకి ప్రవేశపెట్టే దశను ప్లేస్‌మెంట్ అని అంటారు. మరొక రకంగా చెప్పాలంటే అక్రమంగా సంపాదించిన డబ్బును సక్రమ మార్గాల ద్వారా సంపాదించినట్లు చూపించే దశ.ఉదాహరణకు మీ చేతిలోకి అకస్మాత్తుగా పెద్ద మొత్తంలో ఆదాయానికి మించిన డబ్బు వచ్చింది. ఈ డబ్బు దొంగతనం, లంచాలు, దోపిడీలు, అవినీతి కార్యకలాపాల ద్వారా రావచ్చు. ఈ లావాదేవీలన్నీ సాధారణంగా నగదు రూపంలో జరుగుతాయి.ఉదాహరణకు ఒక వ్యక్తికి అక్రమ మార్గాల ద్వారా వారానికి రూ.3లక్షల రూపాయిలు సమకూరుతున్నాయి. ఈ డబ్బును బ్యాంకులో డిపాజిట్ చేయాలి. అలా చేయడం వల్ల మాత్రమే ఆయన ఆ డబ్బును చట్టబద్ధమైన సొమ్ముగా చూపించగలరు.ఈ డబ్బును చిన్న మొత్తాలుగా విడదీస్తారు. 3 లక్షలను ఆరు భాగాలుగా విభజించి ఆరు సార్లు లావాదేవీలు నిర్వహిస్తారు. ఇలాంటి వాటిని ఒకే బ్యాంకులో కాకుండా వేర్వేరు బ్యాంకుల్లో ఉన్న అకౌంట్లలో జమ చేస్తారు.ఇందుకోసం నిబంధనలను కఠినంగా పాటించని బ్యాంకులను ఎంపిక చేసుకుంటారు. చట్ట వ్యతిరేకంగా సంపాదించిన డబ్బును ఆర్థిక వ్యవస్థలోకి ప్రవేశపెడతారు.విదేశాల్లో ఉండే షెల్ సంస్థలు లేదా అకౌంట్లకు కొంత సొమ్మును పంపిస్తారు. పన్ను ఎగవేతదారులకు స్వర్గధామాలుగా ఉన్న దేశాల్లో షెల్ సంస్థలు, అకౌంట్లను తెరుస్తారు. ఈ అకౌంట్లలోకి డబ్బును చేరుస్తారు.కొన్ని వ్యాపారాల్లో జరిగే లావాదేవీల్లో ఈ నల్లధనాన్ని వైట్ మనీతో చిన్న మొత్తాల్లో కలిపేస్తారు. ఉదాహరణకు నగదు లావాదేవీలు ఎక్కువగా జరిగే రియల్ ఎస్టేట్, క్యాసినో, క్లబ్‌లు, బార్ల లాంటి వ్యాపారాల్లో చేరుస్తారు.నల్ల ధనాన్ని సక్రమంగా సంపాదించిన ధనంగా చూపించేందుకు రకరకాల మార్గాలు అవలంబిస్తారు.బ్లాక్ మనీని బదిలీ చేసేందుకు ఇన్‌వాయిస్ మోసాలు చాలా ఎక్కువగా చేస్తారు. ఒక వస్తువు లేదా సేవల ఇన్‌వాయిస్ విలువను ఎక్కువ లేదా తక్కువ చేసి చూపిస్తారు. వస్తువులను మారు పేర్లతో రవాణా చేయడం (విలాసవంతమైన వస్తువులను తక్కువ విలువున్న వస్తువులుగా చూపించడం), ఉత్పత్తులను, సేవలను కొనకుండా కొన్నట్లు బిల్లులు చూపించడం ఇన్‌వాయిస్ మోసం కిందకే వస్తుంది.షెల్ కంపెనీలు, ఉనికిలోలేని సంస్థల నుంచి సామగ్రి కొనుగోలు చేసినట్లు రికార్డుల్లో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. కొన్నిసార్లు ధరలను కావాలనే ఎక్కువ చేసి చూపించినట్లు తేలింది. నగదు రూపంలో డబ్బులు చెల్లించి భూములు కూడా కొన్నట్లు వెలుగులోకి వచ్చింది.కంపెనీ ఖాతాలో వ్యక్తిగత ఖర్చులను కలిపి రాయడం, ప్రభుత్వ రిజిస్ట్రేషన్ విలువ కంటే చాలా తక్కువకే భూములు కొనుగోలు చేయడం లాంటి అవకతవకలను కూడా అధికారులు గుర్తించారు. డబ్బును ఆర్థిక వ్యవస్థలోకి వివిధ మార్గాల్లో ప్రవేశ పెట్టి, రకరకాల లావాదేవీలను నిర్వహిస్తారు. దీనిని న్యాయంగా సంపాదించిన డబ్బుగా చూపిస్తారు.డబ్బు పూర్తిగా ఆర్థిక వ్యవస్థలోకి ప్రవేశపెట్టగానే బ్యాంకు అకౌంట్లలోంచి నచ్చిన విలాసవంతమైన వస్తువులు కొనుక్కోవడం, విదేశీ పర్యటనలు చేయడం లాంటివి చేస్తారు.ఇందుకోసం నేరుగా బ్యాంకు నుంచి డబ్బులు విత్ డ్రా చేస్తారు. లేదా ఏటిఎం నుంచి డబ్బులు తీస్తారు.డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందని వివరించేందుకు ఇంటెగ్రేషన్‌ను చాలా జాగ్రత్తగా చేస్తారు.తిరిగి ఈ డబ్బంతా రకరకాల అకౌంట్లు, వ్యక్తుల చుట్టూ తిరిగి నేరస్థుడు లేదా అసలైన యజమానిని చేరుతుంది. ఈ దశలో బ్లాక్ మనీకి, వైట్ మనీకి మధ్య తేడా కనిపెట్టడం చాలా కష్టంగా మారుతుంది. ఈ డబ్బును ఎలా కావాలంటే అలా ఉపయోగించుకోవచ్చు. ఇక ఎవరూ తమను పట్టుకోలేరనే ధీమాతో లాండరర్ అక్రమంగా సంపాదించిన డబ్బును విచ్చలవిడిగా ఖర్చు పెడతారు.చట్టవ్యతిరేకంగా సంపాదించిన నల్ల ధనం అంతా ఇప్పుడు వైట్ మనీగా మారిపోతుంది. ఈ దశను ఇంటెగ్రేషన్ అని అంటారు.ఈ డబ్బును ప్రాపర్టీ మార్కెట్, ఖరీదైన కార్లు, కళాఖండాలు, నగలు, లేదా ఖరీదైన వస్తువులను కొనుక్కునేందుకు వాడతారు.నిజానికి ఇవన్నీ ఒకదాని తర్వాత ఒకటి జరగాలనే నియమం లేదు. ఈ ప్రక్రియ అంతా ఏకకాలంలో కూడా జరిగే అవకాశముంది. ఈ మొత్తం వ్యవహారాన్ని నిర్వహించడంలో చాలా మంది వ్యక్తుల పాత్ర ఉంటుంది.విద్వేషాలను రెచ్చగొట్టే మతాధికారి అబూ హంజా కొడుకు టిటో ఇబన్ షేక్ నకిలీ బ్యాంకు అకౌంట్ల ద్వారా దొంగతనాలు, మోసాల ద్వారా సంపాదించిన సుమారు 350,000 పౌండ్లను లాండర్ చేసినట్లు కోర్టు విచారణలో తెలిసింది.

# యువతపై సోషల్ మీడియా ఎఫెక్ట్..!




**అమరావతి,తెలంగాణ దిశ :** ప్రస్తుత సమాజంలో శరీర ఆరోగ్యానికి చ్చినంత ప్రాధాన్యత మానసిక ఆరోగ్యానికి ఇవ్వకపోవడం శోచనీయం..! ఏదైనా సమస్య వచ్చినా ఇతరులతో షేర్ చేసుకునే పరిస్థితి కూడా లేదు. ఒక వేళ షేర్ చేసుకోవాలన్నా ఎక్కడికి వెళ్లాలనే సమాచారం కూడా లేదు. దానివల్ల చాలామంది మానసిక ఒత్తిడికి లోనవుతుంటారు. అందుకే ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా 'మానసిక సమస్యలపై బహిరంగ చర్చలు ' జరగాలనే పిలుపునిచ్చింది.

చాలామంది దైనందిన జీవితాల్లో సోషల్ మీడియా ఒక భాగమైపోయింది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, ట్విట్టర్, వాట్సాప్ వంటి వేదికలను యువత నుంచి వృద్ధుల వరకూ వినియోగిస్తున్నారు. భారతీయులు సోషల్ మీడియా మీద సగటున రోజుకు 2 గంటల 40 నిమిషాలు గడుపుతున్నారు. 18-24 ఏండ్ల వయస్సున్న యువతీ యువకులు మరింత ఎక్కువ సమయం కేటాయిస్తున్నారు. కేవలం ఈ వయసు వాళ్లలోనే ఫేస్‌బుక్‌కు 9.72 కోట్ల మంది వినియోగదారులు, ఇన్‌స్టాగ్రామ్‌కు 6.9 కోట్ల మంది వినియోగదారులు భారత్‌లో ఉన్నారు.

ముఖ్యంగా 12 నుండి 22 ఏళ్ల మధ్య ఉండే యువత తమ లక్ష్యాలు, గుర్తింపు కోసం పనిచేసే క్రమంలో వారిపై సోషల్ మీడియా ప్రభావం ఎక్కువగా ఉంటుందని సైకాలజి స్టులు చెబుతున్నారు. అయితే ఆ సోషల్ మీడియాను ఉపయోగకరంగా వాడుకోగలిగితే ఎక్కువ లాభాలుంటాయి.. అదే సోషల్ మీడియాను దుర్వినియోగం చేస్తే పర్యవసానాలు ఊహించడం కష్టం..!

సోషల్ మీడియాలో సొసైటీని చూస్తుంటారు. ఆకర్షితులవుతుంటారు. సోషల్ మీడియాలోకి వెళ్లడానికి ముందుగా చిన్నపిల్లలకు వారి తల్లిదండ్రులు ఆ సోషల్ మీడియాను ఎంతవరకు ఎలా వాడుకోవాలనే విషయాలపై అవగాహన ఇవ్వాలి. అప్పటి నుండి వారు సోషల్ మీడియా ప్లాట్ ఫారం నుండి మంచి విషయాలను తీసుకోగలుగుతారు. మంచి స్కిల్స్ పాజిటివ్ విషయాలు నేర్చుకోగలుగుతారు.

అన్‌లిమిటెడ్: సోషల్ మీడియా వల్ల ప్రస్తుతం ప్రపంచంలో ఎక్కడి వారితోనైనా మాట్లాడగలం.. దీనివల్ల ప్రపంచంలో పలుచోట్ల విషయాలను తెలుసుకోగలుగుతారు. వారి సంస్కృతి సాంప్రదాయాలను తెలుసుకోగలుగుతారు. రకరకాల వంటలు, అభిరుచులు నేర్చుకోగలుగుతారు. ఆయా ప్రాంతాల్లో ఉండేవారి పాజిటివిటీ, యాటిట్యూడ్ వంటివి ఇంకా చాలా విషయాలపై అవగాహన కలుగుతుంది. అయితే సోషల్ మీడియా అనేది అన్‌లిమిటెడ్.. కాబట్టి దాన్ని ఎంతవరకు బ్యాలెన్సింగ్‌గా తీసుకొని వాడగలుగుతున్నామనేదే ముఖ్యం. కాబట్టి ఏ వయస్సులో పిల్లలను సోషల్ మీడియా వేదికపై తీసుకురావాలనే విషయంపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి. పిల్లలు సోషల్ మీడియా నుండి ఏం నేర్చుకుంటున్నారనే విషయాలపై తల్లిదండ్రులు అవగాహన కలిగి ఉండాలి.

చెడు ప్రభావం ఎక్కువ : సోషల్ మీడియా వల్ల ఎన్ని ప్రయోజనాలుంటాయో.. అలాగే నష్టాలు కూడా ఉన్నాయి. మంచి కంటే చెడు ఎక్కువగా ప్రభావితం చేస్తుంది కాబట్టి ఎక్కువగా నష్టాలుంటాయని చెప్పాలి. ముఖ్యంగా యువత వాటికి ఎక్కువగా ఆకర్షితులవుతారు. దాని ప్రభావం ఎంత తీవ్రంగా వారి జీవితంపై పడుతుందనే అవగాహన కూడా ఉండదు. రోజులో 3 గంటలకంటే ఎక్కువగా సోషల్ మీడియాను వాడేవారు ఎక్కువగా ఆందోళనలకు ఒత్తిడి గురవుతున్నట్లు సైకాలజిస్టులు చెబుతున్నారు.లాభాలు: స్నేహితులు, కుటుంబ సభ్యులతో సులభంగా కనెక్ట్ అవ్వడానికి సోషల్ మీడియా సహాయపడుతుంది. కొత్త విషయాలను నేర్చుకోవడానికి, సృజనాత్మకతను పెంచుకోవడానికి విద్యాపరమైన వీడియోలు ఉపయోగపడతాయి. ప్రపంచంలో జరుగుతున్న పరిణామాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు. తమ అభిప్రాయాలను, ప్రతిభను ప్రపంచానికి చాటుకునే వేదికగా స్వీయ అభివృద్ధికి పనిచేస్తుంది.

నష్టాలు : ఎక్కువ నిద్రలేమి, అలసట కలుగుతాయి. మిగిలినవారితో పోల్చుకోవడం వల్ల వారిపై వారికే అనుమానాలు వస్తాయి. చేయలేను, అవ్వదు.. అనే నిరాశ, ఆత్మనూన్యతాభావం కలుగుతుంది. ఆన్‌లైన్ వేధింపులు మానసిక వేదనకు, తీవ్రమైన సందర్భాల్లో ఆత్మహత్య ఆలోచనలకు దారితీస్తాయి. గంటల తరబడి ఫోన్‌లకు అతుక్కుపోవడం వల్ల అది వ్యసనంగా మారి చదువు, శారీరక శ్రమ తగ్గిపోతుంది. తప్పుడు వార్తలు, విషపూరిత కంటెంట్‌కు గురికావడం వల్ల తప్పుడు అభిప్రాయాలు ఏర్పడవచ్చు. ఇతరులకన్నా తక్కువ అనే భావన పెరుగటంతో ఇతరులను వేధించటం, బెదిరించటం, వంటి దుష్ట లక్షణాలు అలవడుతున్నాయి. దీనివల్ల ఆయావ్యక్తుల ఆరోగ్యం కూడా దెబ్బతింటున్నది. ఇన్ని నష్టాలుంటాయి కాబట్టి జాగ్రత్తగా ఆచితూచి అడుగులు వేయాల్సి ఉంటుంది.

యూనిసెఫ్ ప్రకారం : యూనిసెఫ్ ప్రకారం.. 15-24 ఏండ్ల వయసున్న భారతీయుల్లో ప్రతీ ఏడుగురిలో ఒకరు కుంగుబాటు (డిప్రెషన్)కు గురవుతున్నారు. డిప్రెషన్ వల్ల ఆత్మవిశ్వాసం లోపించటం, ఏకాగ్రత లేకపోవటం, ఇతరులతో వ్యవహరించే పద్ధతిలో, సంభాషించే విషయంలో సమస్యలు ఎదుర్కోవటం వంటివి తలెత్తుతున్నాయి. ఫలితంగా చేస్తున్న పని మీద, చదువుల మీద దృష్టి పెట్టలేకపోవటం, దుందుడుకుతనంతో కొట్లాటలకు దిగటం, ఆత్మహత్య ఆలోచనలకు గురికావటం వంటి మరింత సంక్షోభంలోకి వెళ్తున్నది యువత. టైమ్స్ జర్నల్‌లో ప్రచురితమైన ఒక అధ్యయనం ప్రకారం %% తాము అందంగా లేమని భావించే టీనేజీ అమ్మాయిల్లో 32 శాతం మంది ఇన్‌స్టాగ్రామ్ కారణంగా మరింత న్యూనతకు గురయ్యామని చెప్పారు.

పరిష్కార మార్గాలేమిటంటే : సోషల్ మీడియా వాడకానికి సమయ పరిమితులను విధించుకోవడం, తల్లిదండ్రులు పిల్లల ఆన్‌లైన్ కార్యకలాపాలను పర్యవేక్షించడం, డిజిటల్ డిటాక్స్ (కొంతకాలం సోషల్ మీడియాకు దూరంగా ఉండటం) పాటించడం, ముఖ్యంగా, సోషల్ మీడియా ఒక రెండంచుల కత్తి వంటిది. దీనిని బాధ్యతాయు తంగా ఉపయోగించడం వల్ల యువత ప్రయోజనం పొందవచ్చు.

నియంత్రణ అవసరం : సోషల్ మీడియా వినియోగంపై ముఖ్యంగా టీనేజీ దశకు కూడా చేరుకోని పిల్లల్లో దాని వినియోగంపై నియంత్రణలు తీసుకురావాల్సిన అవసరం ఉంది. సోషల్ మీడియా వల్ల తలెత్తుతున్న సవాళ్లను ఎదుర్కొనే ప్రయత్నం జరగాలి. డిప్రెషన్, యాంగ్జైటీ వంటి మానసిక సమస్యల కేసులు ఏ స్థాయిలో నమోదవుతున్నాయో రికార్డు చేయాలి. వాటికి కారణాలను గుర్తించాలి. కుల, మత, ప్రాంత, లింగ, వర్గ తదితర సామాజిక అంశాల నేపథ్యాన్ని కూడా తీసుకొని ఈ అధ్యయనం జరపాలి. దేశంలో పెరుగుతున్న మానసిక ఆరోగ్య సవాళ్లను ఎదుర్కోవటానికి అవసరమైన విధానపరమైన, చికిత్సపరమైన పరిష్కారాలు ఈ విధమైన సమగ్ర పరిశోధన వల్లనే లభిస్తాయి.

అవగాహన పెంచాలి: సోషల్ మీడియాను ఎక్కువగా వాడటం వల్ల కలిగే సమస్యపై అవగాహనను పెంచటం. ఈ సమస్యను చెప్పుకోవాలంటేనే భయపడే, మొహమాటపడే పరిస్థితి లేకుండా స్వేచ్ఛాయుత వాతావరణాన్ని కల్పించటం. సమస్య నుంచి బయటపడటానికి బాధితులకు కుటుంబసభ్యులు, స్నేహితులు అండగా నిలబడేలా వారిలో ఆత్మస్థైర్యాన్ని, అవగాహనను పెంపొందించాలి. అంతేగాక, ఇలాంటి వ్యవస్థీకృత సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించాలంటే.. విద్యారంగంలో, పని ప్రదేశాల్లో తీసుకురావాల్సిన మార్పుల గురించి కూడా ఆలోచించాల్సి ఉంటుంది. చర్చలు జరగాలి.

# వైసీపీకి ఏమైంది?




**విజయవాడ,తెలంగాణ దిశ :** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో అసలు ఏం జరుగుతోంది? ఆ పార్టీ గత వైభవం దిశగా అడుగులు వేసే పరిస్థితి ఉందా? 2029 ఎన్నికల్లోసత్తా చాటే పరిస్థితి ఉందా? అసలు ఆ పార్టీలో ఏం జరుగు తోంది? ఇప్పుడు ఏపీ పొలిటికల్ సర్కిల్లో ఇదే చర్చ నడుస్తోంది. 2014 ఎన్నికల్లో ఆ పార్టీ ప్రతిపక్షానికి పరిమితం అయింది. కానీ అనతి కాలంలోనే అధికార టిడిపికి చుక్కలు చూపించింది. కానీ ఇప్పుడు ఎందుకు ఆపరిస్థితి లేదు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విఫలమైం దా? లేకుంటే టీడీపీ కూటమి ప్రభుత్వం గుణపాఠం నేర్చుకుందా? దీనిపై బలమైన చర్చ నడుస్తోంది. అయితే అప్పటికి ఇప్పటికీ కేంద్రం వైఖరి మారింది. అదే తెలుగుదేశం కూటమికి ప్లస్సు అయ్యింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి మైనస్ గా పరిణమించింది.2014లో ఎన్డీఏలో కీలక భాగస్వామిగా ఉంది తెలుగుదేశం పార్టీ. అంతకుముందు బిజెపి వాజ్పేయి నేతృత్వంలో ఉండేది. ఆ తరువాత స్థానం లాల్ కృష్ణ అద్వానీ అలియాస్ ఎల్కే అద్వానీ ఉండేది. అప్పటికే చంద్రబాబు చతురత పనిచేసేది. మిగతా నేతలతో పోల్చుకుంటే చంద్రబాబు సీనియర్ కూడా. వయసు రీత్యా అటల్ బిహారీ వాజ్పేయి సీనియర్ కానీ.. క్షేత్రస్థాయిలోకి వచ్చేసరికి చంద్రబాబు అప్పటికే తనకు తాను నిరూపించుకున్నారు. ముఖ్యంగా నందమూరి తారక రామారావును అధికారానికి దూరం చేసి తాను సొంతం చేసుకున్నారు. అంతటి ప్రతికూల పరిస్థితుల్లో సైతం 1999 ఎన్నికల్లో ఉమ్మడి ఏపీలో గెలిచారు. అందుకే చంద్రబాబుకు వాజ్పేయి తో పాటు ఎల్కే అద్వానీ ఎంతో ప్రాధాన్యం ఇచ్చారు. కానీ 2014లో మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ మరోసారి ఎన్డీఏకు దగ్గరయింది కానీ.. మునుపటి బిజెపి పెద్దల మాదిరిగా చంద్రబాబును నమ్మే స్థితి లేదు. దాని పర్యవసానం అనుభవించారు చంద్రబాబు. దాని నుంచి గుణపాఠాలు నేర్చుకుని 2024 ఎన్నికల్లో సర్వశక్తులు ఒడ్డి బిజెపిని తన ఆధీనంలోకి తెచ్చుకున్నారు చంద్రబాబు. అలా మూడు పార్టీల కలయికతో అద్భుత విజయం సొంతం చేసుకున్నారు.అయితే గత పరిస్థితుల దృష్ట్యా పవన్ కళ్యాణ్ బలమైన మద్దతుదారుడుగా మార్చుకున్నారు చంద్రబాబు. తద్వారా భారతీయ జనతా పార్టీని సైతం తన ఆధీనంలోకి తెచ్చుకున్నారు. ఎందుకంటే ఒక జాతీయ పార్టీగా మూడుసార్లు అధికారంలోకి వచ్చిన పార్టీకి ప్రజా వ్యతిరేకత అనేది సర్వసాధారణం. అదే సమయంలో మిత్రుల ద్వారా బలపడాలన్నది బిజెపి వ్యూహం. ఆ పార్టీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వంలో పరిమితంగా ఉంది మిత్రపక్షాల పాత్ర. అదే సమయంలో కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా పక్షం పెద్ద ప్రాంతీయ పార్టీలతో బలంగా ఉంది. అదే ఎన్డీఏ విషయంలో బిజెపి తర్వాత పెద్ద పార్టీగా టిడిపి ఉంది. అటు తరువాత నితీష్ నేతృత్వంలోని జెడియు, అకాలి దళ్, ఆపై దేవే గౌడ జెడిఎస్ ఉంది. అయితే ఉన్నంతలో తెలుగుదేశం పార్టీ సీనియర్. ఆపై చంద్రబాబు జాతీయస్థాయిలో మంచి నాయకుడు. అందుకే ప్రస్తుత పరిస్థితుల్లో తెలుగుదేశం పార్టీకి భారతీయ జనతా పార్టీ అధిక ప్రాధాన్యం ఇస్తూ వస్తోంది.అయితే బిజెపికి సిద్ధాంతపరంగా వ్యతిరేక పార్టీ వైయస్సార్ కాంగ్రెస్. ఆ పార్టీ పరోక్ష మద్దతు కే తప్ప.. ప్రత్యక్షంగా ఇచ్చే మద్దతుకు ప్రజలు హర్షించరు. ఆ విషయం బిజెపికి తెలుసు. అందుకే ఆ పార్టీని దూరంగా పెడుతోంది కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి. కానీ జగన్మోహన్ రెడ్డి తన వ్యక్తిగత అవసరాల దృష్ట్యా భారతీయ జనతా పార్టీతో మమేకం అయ్యేందుకు ప్రయత్నం చేస్తున్నారు. అది పొలిటికల్ గా చాలా డ్యామేజ్ చేస్తోంది. 2014లో బలమైన ప్రతిపక్షంగా వైయస్సార్ కాంగ్రెస్ ఉంది. 2019లో ఏకపక్షంగా అధికారాన్ని సొంతం చేసుకుంది. 2024లో డిజాస్టర్ ఫలితాలను చవిచూసింది. అయినా సరే ఆ పార్టీ ఎందుకో ఇంకా బీజేపీ అంటూ జపం చేస్తోంది. అది ఎంత మాత్రం నష్టం తప్ప లాభం లేదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# రెగ్యులర్ ఎపిసోడ్‌లాగా రుషికొండ భవనాలు

**విశాఖపట్టణం,తెలంగాణ దిశ :** ఎన్నికలకు ముందు అదే రచ్చ. ఎన్నికలు అయిపో యి..15 నెలలు అవుతున్నా..ఆ భవనాల చుట్టే ఏపీ పాలిటిక్స్ చక్కర్లు కొడుతున్నాయి.ఆ కట్టడాలు వైసీపీకి చేయాల్సినంత డ్యామేజ్ చేశాయి. కూటమికి కావాల్సినప్లస్ పాయింట్‌గా మారాయి.అయినా ఇప్పటి వరకు రుషికొండ భవనాలు రెగ్యులర్ ఎపిసోడ్‌లాగా ఉండిపోతున్నాయి. ప్రతీ నెల రోజులకోసారి ఏదో విధంగా సాగరతీరంలో వైసీపీ హయాంలో కొండను తవ్వేసి కట్టిన కట్టడాల మీదే డిస్కషన్ నడుస్తోంది.ఇప్పుడు మరోసారిలైమ్‌లైట్‌లోకి వచ్చేసింది రుషికొండ ఇష్యూ. విశాఖ సాగర తీరాన వైసీపీ హయాంలో కట్టిన రుషికొండ భవనాల రచ్చ క్లైమాక్స్‌కు చేరేలా కనిపిస్తోంది. సర్కార్ క్యాబినెట్ సబ్‌కమిటీ చర్చలు స్టార్ట్ చేయడంతో..రుషికొండ నిర్మాణాలను దేనికి యూజ్ చేస్తారనే దానిపై ఆసక్తికర చర్చ నడుస్తోంది. రుషికొండ భవనాలను ఏపీ సర్కార్ ఏం చేయబోతోంది?ప్రభుత్వమే వాడుకుం టుందా? రిసార్టులు, హోటల్స్ కోసం రెంట్‌కు ఇస్తారా? సబ్ కమిటీ సూచనలు ఎలా ఉండబోతున్నాయి? భవనాలను మెంటల్ హాస్పిటల్ గా మార్చాలని గోవా గవర్నర్ అశోక్ గజపతి రాజు వంటి వాళ్ల ప్రతిపాదించడం హాట్ టాపిక్ అవుతోంది.మంత్రివర్గ ఉపసంఘం భేటీ అయ్యి.. రుషికొండ భవనాలను ఏ విధంగా వినియోగించుకో వాలనే దానిపై చర్చించింది. ఎలాంటి ఉపయోగం లేకుండా ఉన్న రుషికొండ కట్టడాలతో నెలకు రూ.25 లక్షలు విద్యుత్ ఛార్జీలు, మెయింటనెన్స్ ఖర్చులు భరించాల్సి వస్తోందని చెబుతోంది ప్రభుత్వం. గతంలో రూ.7 కోట్లు ఆదాయం వచ్చే చోట ఇప్పుడు ప్రభుత్వం ఎదురు చెల్లించాల్సి వస్తుందని వాపోతున్నారు

మంత్రులు. రుషికొండ ప్యాలెస్ వినియోగంపై ప్రజాభిప్రాయాలు కోరుతూ ప్రకటన ఇవ్వాలని, ప్రజల అభిప్రాయం ప్రకారం డెసిషన్ తీసుకోవాలి క్యాబినెట్ సబ్ కమిటీ నిర్ణయించింది. హోటల్స్ నిర్వహణ, మానసిక వికలాంగుల చికిత్సాలయ ఏర్పాటు చేయాలంటూ వచ్చిన ప్రతిపాదనలు, సలహాలను మంత్రివర్గ ఉపసంఘం పరిశీలిస్తోందట. అయితే ప్రజల నుంచి సలహాలు, సూచనలు తీసుకున్న తర్వాతే రుషికొండ భవనాలపై ఓ నిర్ణయానికి రావాలని భావిస్తున్నారట.రుషికొండ భవనాలను విషయంలో కూటమి టార్గెట్‌గా వైసీపీ. జగన్ ఫ్యామిలీ సాగర తీరంలో సేద తీరేందుకు..అద్భుతమైన ప్యాలెస్ కట్టారని ముందు నుంచి ఆరోపిస్తూ వస్తోంది కూటమి. అందులో బాత్ టబ్‌లు, లైటింగ్ అరేంజ్‌మెంట్స్..సీ వ్యూ..అంతా జగన్ ఇష్ట ప్రకారం..అతని కుటుంబ సౌఖ్యం కోసం నిర్మించారని విమర్శిస్తున్నారు.

ఈ అలిగేషన్స్‌ను తిప్పికొట్టడంతో వైసీపీ ఇప్పటికీ ఫెయిల్ అవుతూ వస్తూనే ఉంది.ఈ క్రమంలో అదే రుషికొండ భవనాలను అస్త్రంగా చేసుకుని జగన్‌ను, వైసీపీని సందర్భం దొరికినప్పుడల్లా ర్యాగింగ్ చేస్తున్నాయి కూటమి పార్టీలు. పైగా మెంటల్ హాస్పిటల్‌గా మారుస్తామన్న ప్రతిపాదనను తెరమీదకు తెచ్చి ఇండైరెక్టుగా జగన్‌ను టార్గెట్ చేస్తోంది. వైసీపీ హయాంలో తుగ్లక్ పాలన జరిగిందని..టీడీపీ, బీజేపీ, జనసేన మొదటి నుంచి విమర్శిస్తూ వస్తున్నాయ్. కానీ ఇది రాజకీయ విమర్శగానే భావించారు జనం. కానీ ఇప్పుడు రుషికొండ భవనాలను మెంటల్ హాస్పిటల్‌గా మారుస్తామన్న టాక్‌తో..మళ్లీ జగన్‌ను ర్యాగింగ్ చేస్తోంది కూటమి. రుషికొండ భవనాలపై ప్రభుత్వం నిర్ణయం ఎలా ఉండబోతుందో..వైసీపీ రియాక్షన్ ఏంటో చూడాలి మరి.

### డివిజన్ 277 మహదేవపురం కాలనీలో
## ఉచిత ఓటర్ నమోదు



**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 02, (తెలంగాణ దిశ)** :మహాదేవపురం చౌరస్తా జగదీశ్వర్ రెడ్డి కార్యాలయం ప్రాంగణంలో సోమవారం ఉచిత ఓటర్ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఆఫీస్ నందు కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జీ కొలన్ హన్మంత్ రెడ్డి సహకారంతో కాంగ్రెస్ సీనియర్ నాయకులు సంజీవ్ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, నరేందర్ రెడ్డి, జి. దేవేందర్ రెడ్డి సమక్షంలో నిర్వహించారు. ఈ డ్రైవ్ లో అనేక మంది కాలనీ నివాసితులు, 18 సంవత్సరాలు నిండా యువత ఓటర్ నమోదు చేయించుకున్నారు. ఓటర్ కార్డులో మార్పులు చేర్పులతో పాటు నూతనంగా ఓట్లు నమోదు చేయించుకోవలసిన వారు ఆధార్ కార్డు పాస్ ఫోటోతో తమను సంప్రదించాలని కోరారు.

### అరణి శ్రీనివాస్ కు తప్పని పాత వాసనలు!

తిరుపతి: తిరుపతి జనసేన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుపై పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఆగ్రహంగా ఉన్నట్లు కనిపిస్తుంది. వైసీపీ నుంచి వచ్చి పార్టీలో చేరినా ఆరణి శ్రీనివాసులకు తిరుపతి నియోజకవర్గం టిక్కెట్ ఇచ్చారు. టీడీపీ బలంగా ఉన్నప్పటికీ,
అక్కడ మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ తనకు కావాలని గట్టిగా కోరినప్పటికీ పవన్ కల్యాణ్ తిరుపతి నియోజకవర్గం సీటును పట్టుబట్టి జనసేన ఖాతాలో వేసుకున్నారు. పొత్తులో భాగంగా రాయలసీమలోని తిరుపతితో పాటు రైల్వే కోడూరు నియోజకవర్గాలను ఎంచుకున్నారు. చంద్రబాబు నాయుడు కూడా నాడు పొత్తులో భాగంగా తిరుపతి సీటును జనసేనకు కేటాయించారు. దీంతో కూటమి గాలిలో ఆరణి శ్రీనివాసులు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.

### ఏఎస్ రావునగర్ లో...
# సమస్యలను పరిష్కరించాలి
### ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిని కలిసి కోరిన కాలనీవాసులు



**ఏఎస్ రావునగర్, ఫిబ్రవరి 02, (తెలంగాణ దిశ) :**
ఏఎస్ రావునగర్ కాలనీలో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం కాలనీవాసులు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కలిసి విన్నవించారు. బిఆర్ఎస్ సీనియర్ నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో కలిసి ఎమ్మెల్యేకు సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా కాలనీలోని పలు ముఖ్య సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. హుడా పార్కు సమీపంలో ప్రజల అవసరాల దృష్ట్యా జీహెచ్ఎంసీ ద్వారా పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరారు. కాలనీ ప్రవేశ ద్వారం--4 వద్ద పాదచారులు, వాహనాల సురక్షిత కదలిక కోసం ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని కోరారు. ట్రాఫిక్ లైట్లు ఉన్న ప్రవేశ ద్వారం 3జంక్షన్ వద్ద అన్ని వైపులా జీబ్రా లైన్లు, స్టాప్ లైన్లు స్పష్టంగా మార్కింగ్ చేయించాలని కోరారు. ఈ సమస్యలపై లక్ష్మారెడ్డి సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. ముఖ్యంగా పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణ అంశంపై వెంటనే సంబంధిత డిప్యూటీ కమిషనర్ ను ఫోన్ ద్వారా సంప్రదించి, తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారనివారు వివరించారు. మిగిలిన సమస్యలపై సంబంధిత అధికారులతోత్వరలో సమావేశం ఏర్పాటు చేసి, తగిన పరిష్కారాలు అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా తమ సమస్యలపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, అలాగేఈ సమావేశాన్ని సమన్వయం చేసిన సోమశేఖర్ రెడ్డికి కాలనీవాసులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.



## ఆ లేడీ ఆఫీసర్ వయిలెంట్!

**అనంతపురం,తెలంగాణ దిశ :** సత్యసాయి జిల్లా పుట్టపర్తి ఆర్డీవో సువర్ణపై మూకు మ్మడిగా కలెక్టర్‌కు కంప్లైంట్ ఇచ్చారు వీఆర్వోలు. ఆధార్ అప్డేట్ విషయంలో వెనకబడ్డారంటూ వీఆర్వోతో గుంజీలు తీయించారం టూ ఫిర్యాదు చేశారు. పుట్టపర్తిఆర్డీవో కార్యాలయంలో ఆధార్ అప్డే షన్‌పై వీఆర్వోలకు ప్రత్యేక శిక్షణ ప్రోగ్రామ్ జరిగింది. ఈ ట్రైనింగ్ సెషన్‌లో ఒడిసి మండలం వీఆర్వోపై మండిపడ్డారు ఆర్డీవో సువర్ణ. ఆధార్ అప్డేట్‌లో బాగా వెనకబడ్డారంటూ ఫైర్ అయ్యారు. ఆర్డీవో సువర్ణ అడిగిన ప్రశ్నలకు వీఆర్వో సమాధానం ఇచ్చాడు. ఆధార్ అప్డేషన్ జరగకపోవడానికి కారణాలను వివరించాడు. చాలామంది బెంగళూరుకు వలస వెళ్లారని.. వాళ్లు వచ్చేంతవరకూ ఆధార్ అప్డేషన్ చేయలేమంటూ ఆర్డీవోకి సమాధానం ఇచ్చాడు వీఆర్వో.. అంతే,ఆర్డీవో సువర్ణకు సర్రున కోపమొచ్చింది. ఎప్పుడూ ఒకే కా రణం చెబుతూ తప్పించుకుంటావా అంటూ సువర్ణ మం డిప డ్డారు..అంతటితో ఆగకుండా, ఆధార్ అప్డేషన్‌లో వెనకబడినం దుకు గుంజీలు తీయాలంటూ ఆర్డీవో సువర్ణ ఆదేశించారు. ఆర్డీవో ఆర్డర్ వేయడంతో చేసేదేమీలేక.. మిగతా వీఆర్వోల ముందే గుంజీలు తీశాడు. దాంతో, అక్కడున్న వీఆర్వోలందరూ ఆర్డీవో సువర్ణపై ఎదురుతిరిగారు. ఏంటీ నియంతృత్వ పోకడ అంటూ ఆమెతో వాగ్వాదానికి దిగారు. గుంజీలు తీయించడం సరికాదం టూ ఆర్డీవోకు సూచించారు. గుంజీలు తీయించడం ఆపాలని విజ్ఞప్తిచేశారు.ఎంత విన్నవించుకున్నా, ఎంతమంది చెప్పినా వినకుండా వీఆర్వోతో గుంజీలు తీయించారు ఆర్డీవో. దాంతో, ఈ ఘటనపైజిల్లా కలెక్టర్‌ను ఆశ్రయించారు వీఆర్వోలు. తమను అవమానించారంటూ ఆర్డీవో సువర్ణపై కలెక్టర్ శ్యాంప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు.మొత్తంఘటనపై విచారణ జరిపి, ఆర్డీవో సువర్ణపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు వీఆర్వోలు..

## జిల్లాలో 24 నామినేషన్ల ఉపసంహరణ




**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 02, (తెలంగాణ దిశ)** :మేడ్చల్ జిల్లా పరిధిలోని మూడు మున్సిపాలిటీలలో సోమవారం వరకు 24 నామినేషన్లు ఉపసంహరణ చేసుకున్నారు. ఇందులో భాగంగా ఎల్లంపేట మున్సిపాలి టీలో దాఖలైన నామినేషన్లలో 13నామినేషన్లు విత్ డ్రా అయ్యాయి. అదేవిధంగా అలియాబాద్ మున్సిపాలిటీ నామినేషన్లలో ఒక నామినేషన్ విత్ డ్రా అయింది. మూడుచింతలపల్లి మున్సిపాలిటీ లో దాఖలైన నామినేషన్లలో 10 నామినేషన్లు విత్ డ్రా అయినట్లు అధికారులు తెలిపారు.నామినేషన్ లో ఉపసంహరణకు మంగళవారం సాయంత్రం ఐదు గంటల వరకు సమయం ఉండడంతో మరిన్ని నామినేషన్లు ఉపసంహరణ జరిగే అవకాశం ఉంది.
24 నామినేషన్ల ఉపసంహరణతో ప్రస్తుతం మూడు చింతలపల్లి మునిసిపాలిటీ పరిధిలోని 24 వార్డులకు 115 మంది అభ్యర్థులు 115 మంది నామినేషన్లు ఉన్నాయి. అదేవిధంగా అలియాబాద్ లోని 20 వార్డులకు గాను 94 మంది అభ్యర్థులు 94 నామినేషన్లతో రంగంలో ఉన్నారు.ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలో 24 వార్డులకు గాను 142 మంది అభ్యర్థులు 142 నామినేషన్లతో రంగంలో ఉన్నారు. మొత్తం మూడు మున్సిపాలిటీలో 351 మంది రంగంలో ఉన్నారు.


## పీ4 పథకంతో కుటుంబాల దత్తత

**విజయవాడ,తెలంగాణ దిశ :**ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా థింక్ ట్యాంక్ ను ఏర్పాటు చేసుకుంటారు. వారు అనేక రకాలుగా ఆలోచించి ఇటు ఓటు బ్యాంకు పెరిగి రాజకీ యంగా పార్టీ బలోపేతం అవ్వడమే కాకుండా చంద్రబాబు పాలనకు మంచి మార్కులు జనంలో పడేలా అన్ని రకాలుగా ఆలోచించి తగిన పథకాలను రూపొందిస్తారు. థింక్ ట్యాంక్ రూపొందించిన వాటిలో వర్క్ అవుట్ అయ్యేవి మాత్రమే చంద్రబాబు అందిపుచ్చుకుంటారు. అందులో నుంచి ఈ ఏడాది వచ్చిందే పీ4 పథకం. పేదరిక నిర్మూలన కోసం ఈ పథకాన్ని తెచ్చారు. సంపన్నులు పది శాతం ఉంటే పేదరికం ఎక్కువ శాతం ఉంది కాబట్టి వారిని ఆదుకునేందుక ఈ పథకాన్ని తెచ్చారు.మొన్న ఉగాది నాడు పీ4 పథకాన్ని చంద్రబాబు నాయుడు అమరావతిలో ప్రారంభించారు. అయితే ఆశించిన రీతిలో ఇప్పటి వరకూ పెద్దగా రెస్పాన్స్ రాకపోవడంతో చంద్రబాబు పీ4 పథకానికి సంపన్నులు ఆకట్టుకునేలా చర్యలు తీసుకునేందుకు ప్రజాప్రతినిధులతో పాటు తనకు సుదీర్ఘకాలం నుంచి సహకారం అందిస్తూ వస్తున్న పారిశ్రామిక వేత్తలకు అప్పగించారు. వచ్చే ఆగస్టు 15వ తేదీ నాటికి కనీసం ఐదు లక్షల బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందుకోసం ఆన్ లైన్ ద్వారా సంపన్నులు నేరుగా పేదలను ఆదుకునేలా అవసరమైన చర్యలు తీసుకునేందుకు సిద్ధం చేయాలని ఆదేశించారు.నియోజకవర్గాల వారిలో ప్రధానంగా సంపన్నులను గురించి పీ4 పథకానికి సాయం అందించేందుకు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇతర ప్రజాప్రతినిధులు కూడా తమ వంతుగా ప్రయత్నం చేయాలని కోరారు. ఇది ఒక ఛాలెంజ్ గా తీసుకోవాలని ప్రజాప్రతినిధులను ఆదేశించారు. వచ్చే ఉగాది పండగ నాటికి ఎంత మేర బంగారు కుటుంబాలకు లబ్ది జరిగింది? సంపన్నుల పేర్లతో పాటు పారదర్శకంగా వివరాలను వెల్లడించి ఈ పథకాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేలా అవసరమైన చర్యలు సత్వరం ప్రారంభించాలని గట్టిగా కోరారు. తర్వాత పథకం దానంతట అదే విస్తృతంగా డెవెలెప్ అవుతుందని చంద్రబాబు గట్టిగా నమ్ముతున్నారు.ముఖ్యంగా పేదరికంలో మగ్గుతూ ఎన్నో ఏళ్లుగా పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారిని బంగారు కుటుంబాల కింద ఎంపిక చేస్తే వారు కూడా పార్టీ జెండా దించకుండా మరింతగా రాజకీయంగా ఉపయోగపడతారని చంద్రబాబు వేస్తున్న అంచనాలు వర్క్ అవుట్ అయ్యే అవకాశం కనిపిస్తుంది. దీంతో పాటు వచ్చే ఏడాది కూడా మరో కొత్త పథకంతో జనం ముందుకు రావాలని చంద్రబాబు భావిస్తున్నారు. ఇప్పటికే చంద్రబాబు థింక్ ట్యాంక్ నాలుగైదు పథకాలకు రూపకల్పన చేసినట్లు సమాచారం. ప్రజలు ఎక్కువ శాతం మంది లబ్ది పొందేలా మరొక కొత్త పథకాన్ని చంద్రబాబు తెచ్చేయోచనలో ఉన్నారు.

## మధురవనం దోపిడీ..!

**నల్గొండ,తెలంగాణ దిశ :**అది కొండమల్లేపల్లిలోని మండలంలోని కోల్‌ముం తల్‌పహాడ్ గ్రామం. పైగా హైదరాబాద్- నాగార్జునసాగర్ హైవే. ఇంకేముందీ పచ్చని భూముల్ని వెంచర్లుగా మార్చేసి.. రంగురం గుల బ్రోచర్లతో కస్టమర్లను బురిడీ కొట్టించి.. ఆఫర్ల పేరుతో ప్లాట్లను అంటగడుతున్నారు. కొండమల్లేపల్లి మండల కేంద్రానికి కూతవేటు దూరంలో విజన్ ఇన్‌ఫ్రా డవలపర్స్ భారీ ఫామ్ లాండ్ దందాకు తెరలేపింది.మధురవనం పేరుతో ఏకంగా 243 ఫామ్ ల్యాండ్ ప్లాట్లను వెంచర్‌గా చేసి విక్రయాలను మొదలు పెట్టింది. అయితే సదరు వెంచర్ ఏర్పాటుకు కనీస అనుమతులు లేకపోవడం గమనార్హం.అయితే ఈ ఫామ్ ల్యాండ్ అక్రమ దందాకు రెవెన్యూ యంత్రాంగం వంతపాడుతుండడం కొసమెరుపు. వ్యవసాయ భూమిని గుంటల్లో రిజిస్ట్రేషన్ చేసేందుకు కొండమల్లేపల్లి తహసీ ల్దార్ కార్యాలయం వేదిక అయ్యింది. ఇంత జరుగుతున్నా.. జిల్లా రెవెన్యూ యంత్రాంగం మొద్దు నిద్రను వీడడం లేదు. కొండమ ల్లేపల్లి మండలంలోని కోల్‌ముంతల్‌పహాడ్ రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 89,90,92,93ల్లో విజన్ ఇన్‌ఫ్రా డవలపర్స్‌ఆధ్వర్యంలో మధురవనం పేరుఫ్యామ్ ల్యాండ్ వెంచర్ ఏర్పాటయ్యింది. ఈ వెంచర్‌లో ఒక గుంట దగ్గరి నుంచి మొదలు పెడితే.. ఐదారుగుంటల వరకు గుట్టుచప్పుడు కాకుండా రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. నిజానికి డీటీసీపీ, రేరా వంటి అనుమతులేవి లేకుండానే ఫామ్‌ల్యాండ్ ప్లాట్ల విక్రయాలు జోరందుకున్నాయి. అయితే సదరు వెంచర్ యాజమాన్యం ఇందులో కొత్త తరహా దందాకు తెరలేపింది. రిజిస్ట్రేషన్లు గుంటల్లో చేస్తున్నప్పటికీ.. అమ్మకాలు మాత్రం గజాల లెక్కన డబ్బులు దండుకుంటుండడం గమనార్హం. అయితే ప్రతి ఆదివారం స్పెషల్ ఆఫర్ పేరుతో కస్టమర్లను వెంచర్ వద్దకు తీసుకొచ్చి నాన్‌వెజ్ భోజనం.. రంగురం గుల బ్రోచర్లతో బురిడీ కొట్టించి ప్లాట్లను అంటగట్టేస్తున్నారు.పైగా హైదరాబాద్- నాగార్జునసాగర్‌హైవే కావడంతో హైదరాబాద్ మహానగరంతో పాటు మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లా కేంద్రాల నుంచి సైతం కస్టమర్లను కార్లలో తరలించి ప్లాట్లు కొనుగోలు చేసేలా మాయమాటలు చెబుతుండడం కొసమెరుపు.హైదరా బాద్- నాగార్జునసాగర్ హైవేదే భవిష్యత్ అంతా.. ఫ్యూచర్‌లో ఇక్కడ సైతం ఫార్మా సిటీ, ఫ్యూచర్ సిటీ వంటివి రాబోతున్నాయి. హైదరాబాద్ చుట్టూ పక్కలా భూమి అయిపోయింది. ఇక మిగిలింది ఈ హైవేకే. పైగా నాగార్జునసాగర్ ప్రాజెక్టును హైదరాబాద్ మహానగరం భవిష్యత్‌లో పర్యాటకంగా కలిసిపోయే పరిస్థితి వస్తుందంటూ కస్టమర్లను గాలిలోనే మేడలు కట్టేలాచేస్తున్నారు.వాస్తవానికి సగటు సామాన్యుడు భవిష్యత్ అవసరాల కోసం.. పిల్లల ఫ్యూచర్ కోసం మాత్రమే ప్లాట్లను కొనుగోలు చేస్తుంటారు. ఆ అవకాశాన్ని ఆసరాగా చేసుకుని కస్టమర్లు ప్లాట్లు బుక్ చేసేవరకు వదలడం లేదు.ఈ దందాలో ఏజెంట్లు, దళారులకు భారీగా కమిషన్లు ఇస్తుండడంతో ప్రైవేటు ఉద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగులు సైతం ఇదే పనిచేస్తూ తొటి ఉద్యోగులు, బంధువులు, స్నేహితులకు అక్రమ ప్లాట్లను అంటగడుతున్నారు. తీరా ఆ ఫాట్లలో ఇల్లు కట్టుకోవాలంటే.. మస్తు తిప్పలు పడాల్సి వస్తుంది.

## ఆ మాత్రలు.. అసలే వద్దు!



గర్భ నిరోధక మాత్రలు తీసుకొనే మహిళల్లో క్రిప్టోజెనిక్ స్ట్రోక్స్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని తాజా పరిశోధన ఒకటి వెల్లడించింది. సింథటిక్ ఈస్ట్రోజన్, ఎథినిల్ ఈస్ట్రడియాల్, ప్రొజెస్టిరాన్ ఉండే ఈ మాత్రలు.. ఆడవాళ్ల ఆరోగ్యానికి ఏమాత్రం మంచిదికాదని సదరు సర్వే హెచ్చరించింది. మెదడుకు రక్త ప్రవాహం తగ్గడం వల్ల వచ్చే క్రిప్టోజెనిక్ స్ట్రోక్స్‌తోపాటు అనేక అనారోగ్య సమస్యలను తెచ్చిపెడుతుందని చెబుతున్నది. 'యూరోపియన్ స్ట్రోక్ ఆర్గనైజేషన్'లో ఈ సర్వేకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. 18 నుంచి 49 ఏళ్ల వయసు మహిళల్లో క్రిప్టోజెనిక్ స్ట్రోక్స్ రావడానికి గల కారణాలపై యూరోపియన్ యూనియన్‌కు చెందిన పరిశోధకులు ప్రత్యేక సర్వే నిర్వహించారు. ఇందులో 13 వేర్వేరు యూరోపియన్ దేశాల నుంచి క్రిప్టోజెనిక్ ఇస్కిమిక్ స్ట్రోక్ ఉన్న 608 మంది రోగులు పాల్గొన్నారు. వారి హెల్త్ ట్రాక్‌ను క్షుణ్నంగా పరిశీలించిన అధ్యయనకారులు.. మిగతా వారితో పోలిస్తే గర్భ నిరోధక మాత్రలు వాడిన మహిళలకు క్రిప్టోజెనిక్ స్ట్రోక్ వచ్చే అవకాశం మూడురెట్లు ఎక్కువగా ఉన్నట్టు గుర్తించారు. ఇక గర్భధారణ నివారణకు మాత్రలు తీసుకోవడం కేవలం తాత్కాలిక పద్ధతి మాత్రమేననీ, అయినాకొందరు వీటిని తరచుగా తీసుకుంటున్నారని వారు వెల్లడిం చారు. ఫలితంగా మహిళల్లో అనేక రకాల సైడ్ ఎఫెక్ట్స్ వస్తున్నా యని చెబుతున్నారు. ఈ మాత్రలు మహిళల శరీర పనితీరును తీవ్రంగా ప్రభావితం చేస్తాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. వీటిని తీసుకున్న తర్వాత కొందరిలో తీవ్రమైన ఒత్తిడి కనిపిస్తుంది. వికారం, తలనొప్పి లాంటి సమస్యలు వేధిస్తాయి. హార్మోన్లలో అసమానతలు ఏర్పడి.. రుతుక్రమంలోనూ మార్పులు వస్తాయి. అధిక రక్తస్రావం, ఎక్కువ రోజులపాటు రుతుస్రావం లాంటి సమస్యలు ఏర్పడుతాయి. ఇక వీటిని ఎక్కువగా తీసుకుంటే.. భవిష్యత్తులో పిల్లలు పుట్టే అవకాశం లేకుండాపోయే ప్రమాదం కూడా ఉందని అధ్యయనకారులు హెచ్చరిస్తున్నారు. కాబట్టి, ఈ మాత్రలను తీసుకోవడం వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి తెలుసుకున్న తర్వాతే.. వీటిని వాడాలని అంటున్నారు.

## చీరతో పట్టేసే చేప పిల్లలకు భలే డిమాండ్!

**కాకినాడ,తెలంగాణ దిశ :**గోదావరి జిల్లాలో పులసకు ఉన్న క్రేజ్ ఎంటో అందరికీ తె లిసిన విషయమే.. కానీ ఇంచుమించు ఈ సీజన్‌లో అంతే క్రేజ్ ఉన్న గోదావరి వంటకం చీరమేను..చీరతో వేటాడే ఈ చేపపిల్లల టేస్ట్ గు రించి మాంస ప్రియులు చాలా గొప్పగా చెబుతారు.. గోదావరిలో లభ్యమయ్యే ఈచీరమేను రేటు కూడా అంతేస్థాయిలో కూడా ఉంటుంది.. ఎందుకంటే ఇది అరుదుగా దొరికే సీజనల్ చీరమేను కావడం దీనికి ప్రధాన కారణం కూడా.. పూర్వ కాలంలో శేరు, తవ్వ, సోల కింద కొలిచి అమ్మే ఈ చీరమేను ఇప్పుడు కిలోల లెక్కన అమ్మకా లు సాగిస్తున్నారు.. ఒక కిలో చీరమేను రూ.3000 నుంచి రూ.4000 వరకు విక్రయాలు జరుగుతుండగా పావుకిలో చొప్పున కూడా అమ్మ కాలు చేస్తుంటారు స్థానికంగా ఉన్న మత్స్యకారులు.. తాజాగా చీరమేను సీజన్ కావడంతో పుదుచ్చేరీ యానం మార్కెట్‌లో చీరమేను ను కొనేం దుకు ఎగబడుతున్నారు నాన్ విజిటేరియన్స్...గోదావరిలో చీరమేను అరుదుగా దొరుకుతుంది కాబట్టే దీనికి ఇంత ధర పలుకుతుం దం టుంటారు చీరమేను గురించి తెలిసిన వారు.. గోదావరి ప్రవాహం ఓ వైపు, గోదావరిపై వీచే శీతల చల్లగాలులు మరోవైపు ఈ ప్రభావానికి దొందు జాతికి చెందిన చేపపిల్లలు సమూ హంగా నీటి ఉపరితలంపై నురగలాతేలుతూ కదులుతుంటాయి.. నీటిఅలల తాకిడికి నురగ కూడా తోడవ్వడంతో ఈసమూహాన్ని గుర్తించడం మత్స్యకారులకు చాలా తేలిక అవుతుంది.ఈ సమూహం కదలికను ముగ్గురు కలిసి చీరతో అడ్డుకుని పట్టుకుంటారు.. ఇది గట్టుపైకి తీసుకువచ్చి నీళ్లల్లో కడిగి బకెట్లలోఉంచుతారు.. వలకు చిక్కని చిన్న చేపపిల్లలు కావడం, సమూ హంగా కదలడంతో వలకు చిక్కవు గనుక ఈ చేపపిల్లలను చీరతో మాత్రమే పట్టుకునేందుకు వీలవుతుంది.. అందుకే వీటికి చీరమేను అనే పేరు వచ్చిందంటారు.. అయితే ఇప్పుడు సీడ్ నెట్ అందుబాటులో ఉండడం తో వీటితోనే చీరమేనును పట్టుకుంటున్నారు.గోదావరిలో అరుదుగాదొ రికే ఈ సీజనల్ చీరమేను కోసంమాంస ప్రియులు ఎందు కు అంతగా ఎగబడతారు అంటే వీటితో చేసిన వంటకాలు అంత రుచిగా ఉంటాయని చెబుతుంటారు.. కలిపి వేసిన గారెలు అబ్బో ఆ టేస్టే వేరే లెవెల్ అంటుంటారు గోదావరి ప్రజలు.. ప్రస్తుతం చీరమేను యానాం చేపలమార్కెట్‌లో దొరుకుతోంది.. ధవళేశ్వరం, అంతర్వేది, కొంతమంది కిలోల లెక్కన విక్రయాలు చేస్తుండగా కొంత మంది కొలతల ప్రకారం అంటే శేరు, తవ్వ,సోల ప్రకారం కొలిచి అమ్ముతు న్నారు.

# ఆరావళిని రక్షించుకుందాం



ప్రకృతి నిర్మించిన రక్షణ కవచం ఆరావళి పర్వత శ్రేణులను చట్టబద్ధంగా అస్మదీయ మైనింగ్, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు దోచిపెట్టేందుకు కేంద్రం రంగం సిద్ధం చేస్తుండటం ఆందోళనకరం. వందల కోట్ల సంవత్సరాల క్రితం ఆవిర్భవించిన ప్రపంచంలోనే అతి పురాతన మడత పర్వత శ్రేణుల్లో ఒకటైన వీటిని ఇటీవల కేంద్రం కొత్తగా నిర్వచించడం కార్పొరేట్ శక్తుల కోసమేనన్నది బహిరంగ రహస్యం. దానికి సుప్రీంకోర్టు ఆమోదం తెలపడం పర్యావరణానికి, జీవ కారుణ్యానికే కాదు%౸%

మానవ మనుగడకే ప్రమాదకరం. సామాజిక మాధ్యమ వేదికల్లో ఉత్తరాదిన ప్రారంభమైన 'సేవ్ ఆరావళి క్యాంపెయిన్' రోజురోజుకూ దేశవ్యాప్తంగా విస్తరిస్తోంది. ఉత్తర భారతానికి గ్రీన్ లంగ్స్ (పచ్చని ఊపిరితిత్తులు)గా ఉన్న ఆరావళిని కాపాడాలన్న హ్యాష్ ట్యాగ్‌లతో విద్యావంతులు, మేధావులు, పర్యావరణ వేత్తలు, నిపుణులు ముక్తకంఠంతో నినదిస్తున్నారు. అక్రమ మైనింగ్‌ను ఎలా చట్టబద్ధం చేస్తారని కేంద్రాన్ని నిలదీస్తున్నారు.

వంద మీటర్లు.. అంటే 328 అడుగుల కంటే ఎక్కువ ఎత్తున్న వాటినే పర్వతాలుగా పరిగణిస్తామని, 500 మీటర్ల పరిధిలో ఉండే పర్వత సమూహాలనే ఆరావళి పర్వత శ్రేణిగా గుర్తిస్తామని కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ ప్రామాణికాలు నిర్దేశించింది. అంతకంటే తక్కువ ఎత్తుంటే పర్వతాలుగా పరిగణించబోమన్న కేంద్రం వాదనను సుప్రీంకోర్టు ఆమోదించింది. అటవీ, జల, ఖనిజ ఇతర సహజ వనరులను అందిస్తూ.. నాలుగు రాష్ట్రాల సామాజిక, ఆర్థిక ప్రగతికి దోహదపడుతున్న ఆరావళిలోని 90 శాతం ప్రాంతాలకు మైనింగ్, రియల్ ఎస్టేట్ ముప్పు పొంచి వుంది. దేశ రాజధాని ఢిల్లీతోపాటు హర్యానా, రాజస్థాన్, గుజరాత్ వరకూ దాదాపు 700 కిలోమీటర్ల మేర విస్తరించివున్న ఈ పర్వత శ్రేణి థార్ ఎడారి నుంచి వచ్చే ఇసుక, ధూళిని అడ్డుకోవడంలో కీలకమైనవని ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఐ) నివేదిక స్పష్టం చేస్తోంది.

'పీపుల్ ఫర్ ఆరావలీస్' సంస్థ ఇచ్చిన నివేదిక ప్రకారం అనూహ్యంగా పెరిగిన పట్టణీకరణ, ఖనిజాన్వేషణలతో అడవుల్లో ముమ్మరంగా సాగుతున్న తవ్వకాలు, నివాస ప్రాంతాల విస్తరణ వల్ల హర్యానా, రాజస్థాన్‌లోని ఛారీ? దాద్రి, భివాని జిల్లాల్లో పర్వతాలు ధ్వంసమై జీవవైవిధ్యం నాశనమైంది. ఒక్క రాజస్థాన్‌లోనే దాదాపు 25 శాతం కొండలు హరించుకుపోయాయని 2018లోనే సుప్రీంకోర్టు నియమించిన కేంద్ర సాధికార సంఘం తేల్చిచెప్పింది. 25 వేలకుపైగా ఎకరాల్లో కొండలు కనుమరుగయ్యాయి. 2011-17 మధ్యలో ఆరావళి శ్రేణుల నుంచి 9.80 లక్షల టన్నుల ఖనిజ వనరులను అక్రమంగా తరలించారనేది కాగ్ నివేదిక. మైనింగ్, రియల్ ఎస్టేట్ అక్రమాలపై నాలుగు వేలకుపైగా కేసులు న్యాయస్థానాల్లో మూలుగున్నాయి. హర్యానాలోని ఫరీదాబాద్ పరిసర ప్రాంతాల్లో ఖనిజ తవ్వకాలను 2002లోనూ, నాలుగు రాష్ట్రాల్లో తవ్వకాలను 2009లోనూ నిషేధిస్తూ సుప్రీంకోర్టు తీర్పులిచ్చినా అమలు చేసే ప్రభుత్వాలే లేవు. పర్వతాల స్వరూపం మార్చకూడదన్న సుప్రీంకోర్టు తాజా ఆదేశాలు చుట్టూ మైనింగ్ జరుగుతుంటే ఎలా అమలవుతాయి? ఢిల్లీ నుంచి థార్ వరకూ ఎడారిగా మారుతుందని, భూగర్భ జలాలు అడుగంటతాయని, వాయు కాలుష్యంతో ఢిల్లీసహా ఆయా రాష్ట్రాల నుంచి వలస పోవాల్సిన దుస్థితి ఏర్పడుతుందంటున్న పర్యావరణవేత్తల హెచ్చరికలు పాలకుల చెవికెక్కడం లేదు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జూన్ 5న 'ఆరావళి గ్రీన్‌వాల్ ప్రాజెక్టు'ను ప్రారంభించిన ప్రధాని ఢిల్లీ నుంచి గుజరాత్ వరకూ అడవులు పెంచడమే లక్ష్యమన్నారు. 90 శాతం ప్రాంతంలో మైనింగ్ తవ్వేందుకు వీలుగా నిర్వచనాన్నే మార్చేసి పచ్చదనం ఎక్కడి నుంచి వస్తుందో సమాధానం చెప్పాల్సింది ఏలినవారే. 0.19 శాతమే మైనింగ్‌కు అనుమతిస్తున్నామంటూ పర్యావరణ మంత్రి చెబుతున్నది వాస్తవదూరం. వంద మీటర్లకంటే తక్కువ ఎత్తులోని 90 శాతం ప్రాంతాల రక్షణకు చర్యలు చేపట్టాలి. డిజిటల్ మానిటరింగ్, ఏ.ఐ టూల్స్ తదితర చర్యల ద్వారా అక్రమ మైనింగ్‌ను అడ్డుకోవాలి. కోట్ల ఏళ్లగా పర్యావరణానికి పెట్టని కోటగా ఉన్న ఆరావళిని కాపాడుకోవడం, భవిష్యత్ తరాలకు భద్రంగా అప్పగించడం, 'సేవ్ ఆరావళి'కి మద్దతు పలకడం మనందరి బాధ్యత. మన రాష్ట్రంలోనూ లేటరైట్, బాక్సైట్ తదితర విలువైన ఖనిజాలను తవ్వి కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు అత్యుత్సాహం చూపే పర్యావరణ వినాశక చర్యలకు అడ్డుకట్ట పడాలి.

## షర్ట్‌కు స్కానర్.. చెవిలో బ్లూటూత్..

# ఏఐ సాయంతో హైటెక్ కాపీ..

## ఇద్దరు యువకుల అరెస్టు



**కొండాపూర్,తెలంగాణ దిశ:** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో కాపీ చేస్తూ ఇద్దరు యువకులు పట్టుబడ్డారు. జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చిం ది.గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ నాన్ టీచింగ్ విభాగంలో జూనియర్ ఆఫీస్ అసిస్టెంట్ ఉద్యోగ నియామకాల కోసం ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈనెల 21వ తేదీన ఉదయం 9 గంటల నుంచి మద్యాహ్నం 12 గంటల వరకు గచ్చిబౌలిలోని వర్సిటీ క్యాంపస్‌లో రాత పరీక్ష నిర్వహించారు. ఈ రాత పరీక్షకు హర్యానా రాష్ట్రానికి చెందిన అనిల్(30) హాజరయ్యాడు. కాగా వరీక్ష రాస్తున్న సమయంలో అనిల్ చెవిలో ఉన్న బ్లూటూత్ నుంచి పదేపదే బీప్ సౌండ్ రావడంతో ఇన్విజిలేటర్ తనిఖీ చేశాడు. అప్పుడే షర్ట్‌కు ఉన్న స్కానర్ కనిపించింది. ఆ స్కానర్‌తో క్వశ్చన్ పేపర్ స్కాన్ చేసి, బాత్‌రూంమ్‌కు వెళ్లి అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో సమాధానాలు తెలుసుకుని.. చెవిలో ఉన్న బ్లూటూత్‌తో వింటూ సమాధానాలు రాస్తున్నట్లుగా గుర్తించారు. హైటెక్ కాపీయింగ్‌కు పాల్పడుతున్న అనిల్‌ను అదుపులోకి తీసుకున్న వర్సిటీ అధికారులు మిగతా విద్యార్థులను కూడా క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ క్రమంలోనే హర్యానాకు చెందిన మరో యువకుడు సతీశ్ సైతం కూడా ఇలాగే కాపీ చేస్తున్నట్లు గుర్తించారు. దీంతో ఇద్దరు యువకులను వర్సిటీ అధికారులు గచ్చిబౌలి పోలీసులకు అప్పగించారు. హెచ్‌సీయూ రిజిస్ట్రార్ దేవేశ్ నిగమ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

# కొత్త విధానంతో తగ్గిన జిఎస్టి వసూళ్లు




## ప్రత్యామ్నాయం చూపని కేంద్రం

## 4.6 శాతం తగ్గిన ఆదాయం

**అమరావతి,తెలంగాణ దిశ :** కొత్త జిఎస్టి విధానం రాష్ట్ర ఖజానాపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. సెప్టెంబర్ లో ఈ విధానం అమలులోకి వచ్చినప్పటికీ, పూర్తి స్థాయి ప్రభావం నవంబర్ లో కనిపించింది. అక్టోబర్ కన్నా నవంబర్ లో నాలుగు శాతానికన్నా ఎక్కువగా ఆదాయం తగ్గినట్లు తేలింది. నూతన జిఎస్టి విధానాన్ని అమలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు తగ్గుతున్న ఆదాయానికి ప్రత్యామ్నాయం చూపలేదు. దీంతో రాష్ట్ర ప్రభుత్వంలో ముఖ్యంగా ఆర్థికశాఖ వర్గాల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. 'ఆదాయం తగ్గుతున్న విషయం కేంద్ర ప్రభుత్వ దృష్టిలో ఉంది. కేంద్ర ఆర్థికశాఖకు దీనికి సంబంధించిన సమాచారం పంపాం.' అని ఒక ఉన్నతాధికారి చెప్పారు. నూతన విధానం అమలులోకి వచ్చిన మొదటి నెలలోనే ఆదాయం భారీ స్థాయిలో తగ్గడంతో కేంద్ర ఆర్థికశాఖ దృష్టికి ఆ విషయాన్ని తీసుకువెళ్లినట్లు సమాచారం. గత ఏడాది ఆ సమయానికి ఉన్న ఆదాయం, నూతన విధానంతో తగ్గిన ఆదాయం, ఇదే పరిస్థితి కొనసాగితే రాష్ట్ర ఖజానా పరిస్థితి తదితర అంశాలను వివరిస్తూ కేంద్ర ఆర్థికశాఖకు పూర్తి సమాచారం పంపినట్లు తెలిసింది. అయితే, ఈ సమాచారం అంది నెలలు గడుస్తున్నా కేంద్ర ప్రభుత్వం నుండి అధికారుల్లో ఎటువంటి స్పందన రాకపోవడం చర్చనీయాంశమైంది. దీంతో రాష్ట్ర స్థాయిలోనే ప్రత్యామ్నాయం కోసం వెదుకుతున్నారు. అక్టోబర్ కన్నా నవంబర్ లో ఆదాయం తగ్గడం కనిపించింది. గత ఏడాది అక్టోబర్ లో 2,777 కోట్లు ఆదాయం రాగా, నవంబర్ లో 2,827 కోట్లు వచ్చింది. ఈ ఏడాది అక్టోబర్ లో 3,021 కోట్లు రాగా, నవంబర్ లో కేవలం 2,697 కోట్లు మాత్రమే రావడం గమనార్హం. ఇది 4.60 శాతం తక్కువగా ఉన్నట్లు తేల్చారు ఏడాదికి ఎనిమిది వేల కోట్ల రూపాయలు తగ్గే అవకాశం ఉందని అధికారులు గతంలో అంచనా వేశారు. అయితే, తాజా తగ్గుదలను పరిగణలోకి తీసుకుంటే అంతకన్నా ఎక్కువగా ఉంటుందని భావిస్తున్నారు.

అసలే లీకేజిలు: పన్నుల వసూళ్లలో ఇప్పటికే నెలకొన్న లీకేజిల సమస్య ఖజానాకు భారంగా మారుతోందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పన్నుల ఎగవేత కూడా మరో సమస్యగా ఉందని వారంటున్నారు. ఇప్పుడు జిఎస్ స్లాబ్బుల మార్పు కూడా కొత్త సమస్యకు తెరలేపుతోందన్న భావన వారు వ్యక్తం చేస్తున్నారు. అందుకే జిఎస్టి నష్టాన్ని అధిగమించేందుకు కొత్త మార్గాలనుఎ అన్వేషించాలని యోచిస్తున్నారు. ప్రధానంగా లీకేజిల నివారణ, పాత బకాయిల వసూళ్లపైనే ఎక్కువగా దృష్టి సారించాలని భావిస్తున్నట్లు ఆర్థికశాఖ అధికారి ఒకరు వ్యాఖ్యానించడం గమనార్హం.

# నెల్లూరులో అనిల్ మౌనం..దేనికి సంకేతం



**నెల్లూరు,తెలంగాణ దిశ :**నెల్లూరు రాజకీయాలను ఒకప్పుడు శాసించిన వైసీపీ కీలక నేతగా గుర్తింపు పొందిన పోలుబోయిన అనిల్ కుమార్ యాదవ్ ప్రస్తుతం పూర్తిగా మౌనంగా ఉండడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారి తీస్తోంది. బీసీ సామాజిక వర్గానికి చెందిన నాయకుడిగా, బలమైన గ్రౌండ్ లీడర్‌గా పేరున్న అనిల్ రాజకీయంగా యాక్టివ్‌గా కనిపించకపోవడం వైసీపీకి ఇబ్బందికరంగా మారిందన్న అభిప్రాయం వినిపిస్తోంది.ఇటీవల నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో మేయర్‌గా ఉన్న స్రవంతి రాజీనామా చేయడం పెద్ద దుమారం రేపింది. ఈ పరిణామంతో ఆ పదవిని టీడీపీ దక్కించుకునే అవకాశాలు పెరిగాయని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఇలాంటి కీలక సమయంలో వైసీపీ తరఫున బలమైన నాయకత్వం కనిపించకపోవడం పార్టీ బలహీనతను బయటపెడుతోందని విమర్శలు వస్తున్నాయి.పార్టీలో అనిల్ కుమార్ పాత్ర బలంగా ఉంటే మేయర్ రాజీనామా వరకు వ్యవహారం వెళ్లేదే కాదని వైసీపీ వర్గాల్లోనే చర్చ జరుగుతోంది. పార్టీ నాయకులను ఏకం చేయడం, సమస్యను ముందే చక్కదిద్దడం అనిల్ చేయగలిగేవారని పలువురు అభిప్రాయపడుతున్నారు. కానీ ఆయన నుంచి అలాంటి ప్రయత్నాలు కనిపించకపోవడంతో అసలు కారణం ఏమిటన్న ప్రశ్నలు మొదలయ్యాయి.గత ఎన్నికల్లో నరసరావుపేట పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ఎంపీగా పోటీ చేసిన అనిల్ ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత మళ్లీ నెల్లూరు నగర రాజకీయాలపై దృష్టి పెట్టాలని ఆయన భావించినా, పార్టీ నుంచి అధికారిక బాధ్యతలు మాత్రం ఇప్పటివరకు అప్పగించలేదు. ఈ అంశమే ఆయన నిరాశకు ప్రధాన కారణంగా చెబుతున్నారు. పార్టీ శ్రేణులు కూడా అనిల్ వెంట నిలబడకపోవడం పరిస్థితిని మరింత క్లిష్టం చేసిందిఉద్దేశపూర్వకంగానే పార్టీ తనను పక్కన పెట్టిందన్న భావన అనిల్ అనుచరుల్లో బలంగా ఉంది. వైసీపీ నుంచి బయటకు వెళ్లిన కొందరు నాయకుల పాత్ర కూడా దీనికి కారణమని ఆయన భావిస్తున్నట్టు సమాచారం. ఈ అంశాలపై పార్టీ అధిష్టానం స్పందించకపోవడం అనిల్ మౌనానికి మరో కారణంగా మారిందని అంటున్నారు. ఒకప్పుడు తన అనుమతి లేకుండా ఫ్లెక్సీలు కూడా కట్టలేని స్థితి ఉన్న నెల్లూరు సిటీ లో ఇప్పుడు తన మాటకు విలువ లేకపోవడం అనిల్‌కు తీవ్ర మనస్తాపాన్ని కలిగిస్తోందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పైగా సొంత బాబాయి టీడీపీలో చేరడం రాజకీయంగా ఆయనకు మరింత ఇబ్బందిగా మారింది. ఈ పరిస్థితుల్లో అనిల్‌కు మళ్లీ ప్రాధాన్యం దక్కుతుందా, లేక నెల్లూరు రాజకీయాల్లో ఆయన పాత్ర ముగింపు దశకు చేరిందా అన్నది కాలమే నిర్ణయించాల్సి ఉంది. ప్రస్తుతం మాత్రం నెల్లూరు రాజకీయాల్లో అనిల్ ప్రభావం కనిపించడం లేదన్నది స్పష్టంగా అర్థమవుతోంది.


# రైలులో యువకుడికి గుండెపోటు

## అధికారుల నిర్లక్ష్యంతో చికిత్స అందక మృతి

ముంబై: ముంబైలోని స్థానిక రైలులో ప్రయాణిస్తున్న యువకుడు గుండెపోటుకు గురై చికిత్స పొందలేక మృతి చెందాడు. ఛత్రపతి శివాజీ మహారాజ్ టెర్మినస్-పన్వేల్ రైలులో ప్రయాణిస్తున్నప్పుడు ఛాతీ నొప్పి వచ్చి హర్ష్ పటేల్ (25) కుప్పకూలిపోయాడు. తోటి ప్రయాణికులు వెంటనే రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. ఆ యువకుడిని వెంటనే వాషి స్టేషన్‌లో దింపి 108 అంబులెన్స్‌లో ఉంచారు. కానీ ఈ సమయంలో అంబులెన్స్ డ్రైవర్ భోజనం చేయడానికి వెళ్ళాడు. చాలా సేపటి తర్వాత, హర్ష్‌ను చివరకు పోలీసు జీపులో నవీ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ ఆసుపత్రికి తరలించారు. కానీ ఆ యువకుడు ఆసుపత్రికి చేరుకునే సమయానికి ప్రాణాలు కోల్పోయాడు. మరణానికి కారణం గుండెపోటు అని, సకాలంలో చికిత్స పొంది ఉంటే యువకుడిని కాపాడి ఉండేవారని వైద్యులు తెలిపారు. 24 గంటలూ అంబులెన్స్‌లో ఉండాల్సిన డ్రైవర్లు ప్రత్యామ్నాయ మార్గాలు తీసుకోకుండా భోజనం చేయడానికి వెళ్లకూడదని, జరిగినది తీవ్రమైన నిర్లక్ష్యం అని యువకుడి కుటుంబం ఆరోపించింది. రైల్వే పోలీసులు కూడా తీవ్ర నిర్లక్ష్యంగా ఉన్నారని ఆ కుటుంబం చెబుతోంది. వాషి స్టేషన్‌లో స్ట్రెచర్లు, వీల్‌చైర్లు, ప్రథమ చికిత్స పెట్టెలు లేదా సిపిఆర్-శిక్షణ పొందిన రైల్వే అధికారులు లేరని, హర్ష్ పటేల్ అత్యవసర సంరక్షణ, చికిత్స పొందకుండానే మరణించారని ఆమె సోదరి అమిక ఆరోపించింది.

# ఇసుక లారీలతో ముప్పు

## చెల్లూరు వద్ద రహదారి అస్తవ్యస్తం



**కరీంనగర్,తెలంగాణ దిశ :** కరీంనగర్-జమ్మికుంట ప్రధాన రహదారిపై చెల్లూరు గ్రామ పరిధిలో ఇసుక లారీల అక్రమ పార్కింగ్, నిర్లక్ష్య డ్రైవింగ్‌తో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వందల సంఖ్యలో లారీలను రహదారి ఇరుపక్కల అడ్డగోలుగా నిలిపివేయడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. రహదారి వెడల్పు తగ్గిపోవడంతో బస్సులు, ఇతర వాహనాలు ఎదురెదురుగా వచ్చినప్పుడు ప్రమాదాలు తప్పడం కష్టంగా మారిందని డ్రైవర్లు వాపో తున్నారు. ముఖ్యంగా రాత్రివేళల్లో సరైన లైటింగ్ లేకుండా అతివేగం తో దూసుకొస్తున్న లారీలు ప్రమాద ముప్పును మరింత పెంచుతున్నా యని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇసుక లారీల అక్రమ పార్కింగ్, వేగ నియంత్రణపై తక్షణమే కఠిన చర్యలు తీసుకుని రహదారిని సురక్షితంగా మార్చాలని బస్సు డ్రైవర్లు, ప్రయాణికులు, గ్రామస్తులు సంబంధిత అధికారులను డిమాండ్ చేస్తున్నారు.

# మెస్సీ టూర్ - రంగంలోకి ఈడీ..?

న్యూఢిల్లీ, : అర్జెంటీనా ఫుట్బాల్ ఆటగాడు మెస్సి ఇటీవల తన గోట్ టూర్ భాగంగా ఇండియాకు వచ్చాడు. ఈ క్రమంలో కోల్ కతా లో ముందుగా పర్యటించాడు. అక్కడి సాల్ట్ లేక్ స్టేడియంలో నిర్వాహకుల నిర్లక్ష్యం వల్ల 22 నిమిషాల్లోనే మైదానం నుంచి వెళ్లిపోయాడు.. హైదరాబాదులో అతని టూర్ సజావుగానే సాగింది. ముఖ్యమంత్రి స్వయంగా ఫుట్బాల్ ఆడాడు. దీంతో సందడి వాతావరణం ఏర్పడింది. ముంబైలో కూడా నిర్వహించిన గోట్ టూర్లో సచిన్ నుంచి మొదలుపెడితే మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ వరకు అందరూ హాజరయ్యారు.కోల్ కతా టూర్ లో నిర్వాహకుల నిర్లక్ష్యం వల్ల పెను దుమారం ఏర్పడింది. దీంతో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ క్షమాపణ చెప్పాల్సి వచ్చింది. ఆ రాష్ట్రానికి చెందిన క్రీడా శాఖ మంత్రి రాజీనామా కూడా చేయాల్సి వచ్చింది. అంతేకాదు శతద్రు అనే వ్యక్తిని కూడా పశ్చిమ బెంగాల్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇక్కడితోనే ఈ వివాదం ఆగిపోవడం లేదు. ఈ వ్యవహారాన్ని లోతుగా దర్యాప్తు చేస్తే గ్భ్రాంతికరమైన వాస్తవాలు తెలుస్తున్నాయని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఏర్పాటుచేసిన దర్యాప్తు సంస్థ చెబుతోంది. దీనికి సంబంధించి జాతీయ మీడియాలో వార్తలు కూడా వస్తున్నాయిమెస్సీ టూర్ లో భారీ కుంభకోణం చోటుచేసుకుందని తెలుస్తోంది. జాతీయ మీడియాలో వస్తున్న వార్తలు, సిట్ దర్యాప్తు జరుపుతున్న తీరు ప్రకారం దాదాపు 100 కోట్ల కుంభకోణం జరిగి ఉంటుందని సమాచారం. మెస్సీ తో ఫోటోలు దిగడం, టికెట్ల విక్రయాలలో అవకతవకలు చోటు చేసుకన్నాయని తెలుస్తోంది. ఇప్పటికే ఈవెంట్ నిర్వాహకుడు శతద్రు ను పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి ఇంట్లో సోదాలు కూడా జరిపారు. అతని ఖాతాలో ఉన్న 22 కోట్లను సీజ్ చేశారు. ప్రత్యేక దర్యాప్తు సంస్థ దీనిని లోతుగా విచారిస్తోంది. కోల్ కతా లోని శతద్రు ఇంటికి వెళ్లి చూసిన ప్రత్యేక దర్యాప్తు బృందం ఒక్కసారిగా ఆశ్చర్య పోయింది. అతడి సామ్రాజ్యాన్ని చూసి నోరు వెళ్ళబెట్టింది.దాదాపు మూడు అంతస్తులలో అతడు భవనాన్ని నిర్మించుకున్నాడు.. తన ఇంటిపై ఏకంగా అతడు ఫుట్ బాల్ మైదానాన్ని నిర్మించుకున్నాడు. అతి పెద్ద ఈతకొలను.. అన్ని రకాల సౌకర్యాలు ఉన్న కార్యాలయం.. అతడు నివసిస్తున్న ఇంట్లో ఉన్నాయని ప్రత్యేక దర్యాప్తు బృందం అధికారులు గుర్తించారు..మెస్సి టూర్ ద్వారా శతద్రు బృందం భారీగా సంపాదించిందని.. 100 కోట్ల వరకు వెనకేసుకుందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మెస్సి తో ఫోటో దిగడానికి పది నుంచి 30 లక్షల వరకు నిర్వాహకులు వసూలు చేశారు. మిా చెల్లింపులకు సంబంధించి అధికారికంగా ఎటువంటి లెక్కలు చూపించలేదు. టికెట్ల విక్రయాలలోను భారీ స్థాయిలో అక్రమాలకు పాల్పడ్డారు. ఈ నేపథ్యంలోనే శతద్రు ఖాతాలో ఉన్న 22 కోట్లను పోలీసులు సీజ్ చేశారు. ఇంకా లోతుగా దర్యాప్తు జరిపితే మరిన్ని విషయాలు వెలుగు చూస్తాయని తెలుస్తోంది. తెలంగాణ రాష్ట్రంలో కూడా మెస్సి పర్యటించిన నేపథ్యంలో.. ఇక్కడ కూడా అక్రమాలు జరిగి ఉంటాయని ప్రతిపక్ష గులాబీ పార్టీ ఆరోపిస్తోంది. అయితే దీనిపై కాంగ్రెస్ పార్టీ కూడా అదే స్థాయిలో విమర్శలు చేస్తోంది. అడ్డగోలుగా మాట్లాడటం గులాబీ పార్టీకి అలవాటైపోయిందని మండిపడుతోంది.

# వేతనం ఆధారంగా హెచ్1-బీ

## 2026లో కొత్త నిబంధనలతో వీసాల జారీకి కసరత్తు

### 'లాటరీ' విధానంలో మార్పులపై తుది సమీక్ష చేస్తున్న అమెరికా




వాషింగ్టన్: విదేశీ వృత్తి నిపుణులకు ఇస్తున్న 'హెచ్1-బీ' వీసా ఎంపిక ప్రక్రియలో సమూల మార్పులు ప్రతిపాదిస్తూ ట్రంప్ సర్కార్ చేపట్టిన ప్రక్రియ తుది దశకు చేరుకుంది. సరికొత్త వీసా విధానంపై 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ' ప్రతిపాదనలు రూపొందించగా, వాటిపై (హెచ్1-బీ లాటరీ సిస్టం) తుది సమీక్ష మొదలైంది. నైపుణ్యం, వేతనాల ఆధారిత లాటరీ వ్యవస్థ కోసం రూపొందించిన నిబంధనలను 'ఆఫీస్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ బడ్జెట్' సమీక్షిస్తున్నది. ఫెడరల్ నిబంధనల మార్పులపై సమీక్షను చివరి దశగా పరిగణిస్తారు. ఇక్కడ ఆమోదం పొందిన తర్వాత నిబంధనలు ఖరారు చేసి వాటిని ప్రకటిస్తారు. సమీక్షను పూర్తి చేసి తుది నిబంధనలకు సంబంధించి అడ్వాన్స్ కాపీని త్వరలోనే విడుదల చేయనున్నట్టు సమాచారం. వచ్చే ఏడాది నుంచే హెచ్-1బీ వీసాల జారీకి ఈ కొత్త నిబంధనలను అమలు చేయాలని అమెరికా సర్కార్ భావిస్తున్నది. అమెరికన్లకు ప్రాధాన్యం!: అమెరికన్లకు ప్రాధాన్యం కల్పించేలా అగ్రరాజ్యం కొత్త మార్పులు తీసుకురానున్నది. ప్రస్తుతం హెచ్-1బీ వీసాల జారీకి కంప్యూటరైజ్డ్ లాటరీ విధానాన్ని అనుసరిస్తుండగా, ఇకపై 'వెయిటెడ్ సెలెక్షన్ సిస్టమ్'ను ప్రవేశ పెట్టనున్నారు. దీని ప్రకారం ఉద్యోగి వేతన స్థాయిని అనుసరించి రిజిస్ట్రేషన్‌లో ప్రాధాన్యం కల్పించటం, వేతన వర్గీకరణ ఆధారంగా దరఖాస్తులను విభజించటం వంటివి చేయనున్నారు. అంటే ఇకపై అధిక వేతనం కలిగిన ఉద్యోగులకు హెచ్-1బీ వీసా లు ఎక్కువగా దక్కే అవకాశం ఉంటుంది. పీఈఆర్ఎం ద్వారా గ్రీన్‌కార్డుకు దరఖాస్తులు: పీఈఆర్ఎం ప్రోగ్రామ్ ద్వారా యూఎస్ గ్రీన్ కార్డుల కోసం దరఖాస్తు ప్రక్రియను పునః ప్రారంభిస్తున్నట్టు గూగుల్ ప్రకటించింది. 2023లో భారీ తొలగింపుల మధ్య ఆగిపోయిన

ఈ ప్రక్రియను పునః ప్రారంభించాలని కంపెనీ ప్రణాళిక సిద్ధం చేసినట్టు బిజినెస్ ఇన్‌సైడర్ వార్తా కథనం తెలిపింది. టెక్ ఉద్యోగుల వీసాలపై ప్రస్తుతం పూర్తి అనిశ్చితి నెలకొన్న క్రమంలో కంపెనీ తన ఇమిగ్రేషన్ పాలసీలో మార్పు చేస్తున్నామన్న విషయాన్ని ఉద్యోగులతో పంచుకుంది. పీఈఆర్ఎం అంటే ప్రోగ్రామ్ ఎలక్ట్రానిక్ రివ్యూ మేనేజ్‌మెంట్. ఇది అమెరికా ప్రభుత్వ లేబర్ సర్టిఫికేషన్ ప్రోగ్రామ్. ఒక విధంగా చెప్పాలంటే అమెరికాలోని ఏదైనా కంపెనీ విదేశీ ఉ ద్యోగులను శాశ్వతంగా నియమించుకోవాలంటే అది అమెరికా ప్రభుత్వం నుంచి పీఈఆర్ఎం లేబర్ సర్టిఫికేషన్ పొందాలి.

ఆ ఉద్యోగానికి అర్హులైన అమెరికా పౌరులు, గ్రీన్‌కార్డు దారులు లేరని నిరూపించడం, విదేశీ ఉద్యోగులను నియమించడం ద్వారా అమెరికా పౌరులకు నష్టం కలగదని నిర్ధారించడం ఈ సర్టిఫికేషన్ ముఖ్య ఉద్దేశం. గత మూడేండ్లుగా ఈ విధానాన్ని

నిలిపివేసిన గూగుల్ ట్రంప్ కఠిన వీసా నిబంధనల కారణంగా పునరుద్ధరించాలని నిర్ణయించింది. 2023లో 12వేల మంది ఉ ద్యోగులకు ఉద్వాసన పలికిన క్రమంలో ఆ ఏడాది జనవరి నుంచి పీఈఆర్ఎం దరఖాస్తులను కూడా గూగుల్ నిలిపివేసింది. ఆ సమయంలో అమెజాన్, మెటా లాంటి దిగ్గజ టెక్ కంపెనీలు కూడా ఆ కార్యక్రమాన్ని నిలిపివేశాయి. ప్రస్తుతం పీఈఆర్ఎం-2026కు దరఖాస్తు చేసుకునే ఉద్యోగులకు కఠినమైన అర్హతా ప్రమాణాలను కంపెనీ నిర్దేశించినట్టు తెలిసింది.

## మైలార్‌దేవ్‌పల్లిలో ఆపరేషన్ చబుత్ర..

### అర్ధరాత్రి రోడ్లపై తిరిగేవారికి పోలీసుల వార్నింగ్




**హైదరాబాద్,తెలంగాణ దిశ :** రాత్రిపూట పెరుగుతున్న నేరాలు, న్యూఇయర్ దగ్గరి కొస్తున్న నేపథ్యంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూసేం దుకు హైదరాబాద్ పోలీసులు అప్రమత్తమయ్యారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు అర్ధరాత్రి ఆపరేషన్ చబుత్రను చేపట్టారు. ఇందులో భాగంగా అర్ధరాత్రి రోడ్లపై తిరుగుతూ, వీధుల్లో కూర్చొని ముచ్చట్లు పెడుతున్న వారికి వార్నింగ్ ఇచ్చారు. నిబంధనలు పాటించకుండా అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా తెరిచి ఉన్న హొటళ్లు, పాన్‌షాపులను మూసివేయించారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సైబరాబాద్ సీపీ ఆదేశాల మేరకు మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఆపరేషన్ చబుత్ర నిర్వహించినట్లుగా ఇన్‌స్పెక్టర్ బి.సత్యనారాయణ తెలిపారు.

### జగన్‌కు జ్వరం..కార్యక్రమాలు రద్దు

**పులివెందుల,తెలంగాణ దిశ :** వైసిపి అధినేత వైఎస్.జగన్ స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. జ్వరంతో బాధపడుతున్న కారణంగా డాక్టర్ల సూచన మేరకు బుధవారం)కార్యక్రమాలను రద్దు చేసుకున్నారు. ఈ మేరకు వైసిపి ఎక్స్ వేదికగా ఈ ప్రకటనను విడుదల చేసింది. పులివెందుల పర్యటనలో భాగంగా వైఎస్ జగన్ ఇడుపులపాయలో ప్రార్థనల్లో పాల్గొనాల్సి ఉంది. అలాగే, మధ్యాహ్నం పులివెందుల క్యాంపు కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండాల్సి ఉ ండగా, అనారోగ్యం కారణంగా ఈ కార్యక్రమాలు రద్దయ్యాయి. క్రిస్మస్ సందర్భంగా గురువారం పులివెందుల సీఎస్ఐ చర్చి క్రిస్టమస్ వేడుకల్లో వైఎస్ జగన్ పాల్గొనే అవకాశం ఉంది.

## సీమలో సైలెంట్ వేవ్..

**కర్నూలు,తెలంగాణ దిశ :**రాయలసీమలో వైసీపీ క్రమంగా పుంజుకునట్లు కనిపిస్తుంది. కూటమి పార్టీ నేతల్లో విభేదాలతో పాటు వైసీపీ పట్ల సానుకూలత ఒకరకంగా వైసీపీకి వచ్చే ఎన్నికల్లో కలసి వచ్చే అంశంగా కనిపిస్తుంది. రాయలసీమలో మొత్తం యాభై రెండు శానసభ నియోజకవర్గాలున్నాయి. అయితే సిట్టింగ్ ఎమ్మెల్యేలపై తీవ్ర వ్యతిరేకత ఎదురవుతుండటంతో పాటు పంటలకు సరైన గిట్టుబాటు ధర లభించకపోవడంతో పాటు రాజధాని అమరావతికే తెచ్చిన రుణాలన్నీ పెడుతున్నారన్న ప్రచారం కూడా కూటమి పార్టీలకు ఇబ్బందికరంగా మారిందన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. గత ఎన్నికల్లో ఒక ఊపు ఊపిన కూటమి ఈసారి మాత్రం కొంత ఇబ్బందికరమైన పరిస్థితులు నెలకొన్నాయని ఖచ్చితంగా చెప్పాలి. అందులోనూ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాల ప్రభావం కూడా కూటమి పై ప్రతికూలత చూపుతుందని అంటున్నారు.గత ఎన్నికల్లో కర్నూలులో పథ్నాలుగు స్థానాలుంటే రెండు స్థానాల్లో మాత్రమే వైసీపీ గెలిచింది. అది కూడా ఆలూరు, మంత్రాలయంలో మాత్రమే ఫ్యాన్ పార్టీ గలిచింది. ఆదోనిలో బీజేపీ, మిగిలిన పదకొండు నియోజకవర్గాల్లో టీడీపీ విజయం సాధించింది. అనంతపురం జిల్లాలో పథ్నాలుగు నియోజకవర్గాలుంటే కూటమి గత ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేసింది. ధర్మవరంలో మాత్రం బీజేపీ గెలిచింది. మిగిలిన పదమూడు చోట్ల టీడీపీ అభ్యర్థులు విజయం సాధించారు. కడపలో పది నియోజకవర్గాలుంటే అందులో మూడింటిలో వైసీపీ మిగిలిన చోట్ల టీడీపీ, జనసేన, బీజేపీ గెలుచుకున్నాయి. వైసీపీ బద్వేలు, కడప, మైదుకూరుల్లో మాత్రమే గెలిచింది. ఇక చిత్తూరు జిల్లాలో పథ్నాలుగు నియోజకవర్గాలుంటే రెండింటిలో మాత్రమే వైసీపీ గెలిచింది. తంబళ్లపల్లి, పుంగనూరులో వైసీపీ గెలుపొందగా తిరుపతిలో జనసేన గెలిచింది. ఇప్పటికే కడప, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో పరిస్థితులు మారాయన్న సంకేతాలు వెలువడుతున్నాయి. ఇక్కడ కూటమి నేతలు యాక్టివ్ గా లేకపోవడంతో పాటు వైసీపీ నేతలు క్రమంగా బలం పుంజుకుంటున్నట్లు కనపడుతుంది. ఇక వచ్చే ఏడాది ప్రారంభంలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత వైసీపీ మరింత బలపడే అవకాశాలున్నాయని అంటున్నారు. వేవ్ ఇప్పుడు సీమ జిల్లాల్లో మారిందన్నది నిఘా వర్గాలు కూడా ప్రభుత్వానికి అందించినట్లు సమాచారం. ప్రజల్లో అధికార పార్టీపై ఎప్పుడూ అసంతృప్తి ఉంటుంది. అది ప్రతిపక్ష పార్టీకి కొంత అనుకూలంగా మారుతుంది. మరొకవైపు జగన్ ను సీమ ప్రాంత వాసిగా చూడటంతో మరికొంత ప్లస్ అయిందని అంటున్నారు.మరి చివర వరకూ ఇదే పరిస్థితి కొనసాగితే మాత్రం రాయలసీమలో కూటమికి కష్టాలు.. వైసీపీకి వేవ్ మామూలుగా ఉ ండవన్న విశ్లేషణలు బలంగా వినిపిస్తున్నాయి.

## మూడేళ్ల ముందు నుంచే టిక్కెట్ల లొల్లి

**మహబూబ్ నగర్,తెలంగాణ దిశ :** ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని షాద్‌నగర్ బీఆర్ఎస్‌లో వర్గ విభేదాలు పీక్ లెవల్‌కు చేరాయి. కారు పార్టీలో రెండు వర్గాల మధ్య ఆధిపత్య పోరుతో క్యాడర్ రెండుగా చీలిపోయిం దన్న టాక్ వినిపిస్తోంది. షాద్ నగర్ నియోజకవర్గంలో 2014, 2018లో రెండు సార్లు ఘన విజయం సాధించిన గులాబీ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలైంది. గత రెండేళ్లుగా పార్టీ వర్గ విభేదాలతో కొట్టుమిట్టాడుతోంది. బీఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌కు, మహబూబ్ నగర్ స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డికి ఏ మాత్రం పొసగడం లేదు. అంజయ్య యాదవ్, నవీన్ రెండు వర్గాలుగా విడిపోవడంతో ద్వితీయస్థాయి నేతలతో పాటు కార్యకర్తలు అయోమయంలో పడ్డారట. అధికార పార్టీ మీద పోరాడాల్సింది పోయి..సొంత పార్టీలో ఈ కుంపటి ఏంటంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారట గులాబీ పార్టీ కార్యకర్తలుమాజీ ఎమ్మెల్యే అంజయ యాదవ్ ఈ సారి తన కుమారుడికి టికెట్ ఇప్పించుకునే ప్రయత్నంలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి కూడా వచ్చే ఎన్నికల్లో షాద్‌నగర్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు ట్రై చేస్తున్నారట. నవీన్ రెడ్డి ఎమ్మెల్యే సీటుపై కన్నేయడంతో తమ సీటుకు ఎసరు వస్తుందన్న ఆందోళనలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ వర్గం అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారట. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక నవీన్ కుమార్ రెడ్డి బీఆర్ఎస్ తరఫున స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీగా గెలవడంతో ఆయనపై బీఆర్ఎస్ అధిష్టానానికి మంచి అభిప్రాయం

ఉండటంతో పాటు ఆర్థికంగా రాజకీయంగా అన్ని విధాల నవీన్ కుమార్ బలంగా ఉండటంతో స్పీడు పెంచారు. ఇదే ఇప్పుడు అంజయ్య యాదవ్ వర్గంలో ఆందోళన కు కారణమవుతోందని తెలుస్తోంది.ఎమ్మెల్సీ హోదాలో ఉన్న నవీన్ రెడ్డి..హైదరాబాద్‌లోని పార్టీ ఆఫీస్ మొదలుకొని షాద్‌నగర్ వరకు ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తూ ప్రజల దృష్టిలో, అధిష్టానం దృష్టిలో పడే ప్రయత్నం చేస్తున్నారట. అంతేకాదు బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలకు షాద్‌నగర్ నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలను తరలించడంతో..కేటీఆర్ కూడా నవీన్ రెడ్డిని అభినందించారట. ఇది మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌వర్గానికి ఏ మాత్రం రుచించడంలేదంటున్నారు.అప్పటి నుంచి ఇరు వర్గాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోదన్న టాక్ వినిపిస్తోంది. లేటెస్ట్‌గా జరిగిన పంచాయతీ ఎన్నికల్లోనూ ఓ వైపు అంజయ్య యాదవ్, మరోవైపు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి ఎవరికి వారు సెపరేట్‌గా.. తమ వర్గానికి చెందిన అభ్యర్థులను బరిలోకి దింపి చాలా వరకు గెలిపించుకున్నారు. అయితే అంజయ్య యాదవ్, నవీన్ రెడ్డి వర్గ పోరు పార్టీకి డ్యామేజ్ చేస్తుందన్న ఆందోళన క్యాడర్ కనిపిస్తోందట. ఇంకా కొన్ని పంచాయితీల్లో గెలవాల్సి ఉన్నా అంజయ్య యాదవ్, నవీన్ రెడ్డి విభేదాలతో అధికార కాంగ్రెస్‌కు మేలు జరిగిందని అంటున్నారు. ఇక షాద్‌నగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ మద్దతుదారులుగా బరిలో నిలిచి గెలిచిన సర్పంచ్‌లను తెలంగాణ భవన్‌లో సన్మానించారు

కేటీఆర్.ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి హాజరు కాలేదు. అంతే కాకుండా ఈ సమావేశంలో అంజయ్య యాదవ్ మళ్లీ భారీ మెజార్టీతో గెలుస్తారని కేటీఆర్ చెప్పడంతో మళ్లీ ఆయనకే టికెట్ అని చెప్పకనే చెప్పారన్న చర్చ మొదలైంది. ఇంకా ఎన్నికలకు మూడేళ్ల సమయం ఉ ండగానే..మాజీ ఎమ్మెల్యే వర్సెస్ ఎమ్మెల్సీ టికెట్ ఫైట్ ఇంట్రెస్టింగ్‌గా మారింది. అప్పటి వరకు పరిస్థితు ల్లో మార్పు వచ్చి తనకే టికెట్ వస్తుందన్న ధీమాతో నవీన్ రెడ్డి ఉంటే..అధిష్టానం ఆశీస్సులు తనకే ఉన్నాయని అంజయ్య యాదవ్ చెప్పుకుంటున్నారట. మొత్తానికి షాద్‌నగర్ నియోజక వర్గంలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి వర్గాల మధ్య కార్యకర్తలు నలిగిపోవాల్సి వస్తుందట. మాజీ ఎమ్మెల్యే వెంట నడవా లో..ఎమ్మెల్సీ చేపట్టిన కార్యక్రమాల్లో పాల్గొనాలో తెలియక గులాబీ పార్టీ కార్యకర్తలు సతమతం అవుతున్నారని అంటున్నారు.

## పావు వంతు లెక్చరర్లతో చదువు సాగేదెలా..?

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** రాష్ట్రంలోని డిగ్రీ కాలేజీల పరిస్థితి దారుణంగా తయారైంది. సరిపడ బోధనా సిబ్బంది లేక సర్కారు కాలేజీల పరిస్థితి అస్తవ్యస్తంగా తయారైంది. ఉన్నత విద్యను ప్రభుత్వం పట్టించుకోవడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఖాళీ అవుతున్న పోస్టులను ప్రభుత్వం ఎప్పటికప్పుడు భర్తీ చేయకపోవడంతో డిగ్రీ కాలేజీల్లో బోధించే అధ్యాపకుల సంఖ్య ప్రతి ఏటా తగ్గిపోతోంది.రెగ్యులర్ అధ్యాపకులను నియ మించకుండా వారి స్థానంలో గెస్ట్, కాంట్రాక్ట్ అధ్యాపకులను నియమించుకొని నెట్టుకొస్తున్నారు. కాలేజీల్లో సరి పడా సిబ్బంది లేకపోవడంతో తమ పిల్లలను ఆ కాలేజీల్లో చేర్పించేందుకు తల్లిదండ్రులు పెద్దగా సుముఖత చూపించడంలేదు. డిగ్రీ కాలేజీల్లోని కీలక పోస్టులైన ప్రిన్సిపాల్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఫిజికల్ డైరెక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రాష్ట్రంలో 149 డిగ్రీ కాలేజీలుంటే, వీటిలో 4,520 పోస్టులకు పనిచేస్తున్నది మాత్రం కేవలం 1,695 మందే. 2,825 పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. ఇందులోనూ 2,570 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉండడం గమనార్హం. ఈ 2,570 పోస్టుల్లో 50 శాతం డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా, మరో 50 శాతం జూనియర్ లెక్చరర్లను ప్రమోషన్ల ద్వారా భర్తీచేస్తారు. అంతేకాకుండా



145 ప్రిన్సిపాల్ పోస్టులకు గానూ ప్రస్తుతం పని చేస్తున్నది కేవలం 84 మందే.మిగతా పోస్టులు ఖాళీనే. ఫిజికల్ డైరెక్టర్ పోస్టులు 133 ఉంటే కేవలం 23 మంది మాత్రమే పనిచేస్తున్నారు. ఇంకా 110 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. విద్యార్థులను ఆటలు ఆడించే పరిస్థితే లేదు. లైబ్రేరియన్ పోస్టులు 133 ఉంటే, ఏకంగా 90 పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. పనిచేస్తున్నది 43 మంది మాత్రమే. ఇలా ప్రధాన పోస్టుల్లో సిబ్బంది లేక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలు కునారిల్లుతున్నాయి. ఉన్నవారినే ఇన్‌చార్జిలుగా పెట్టి కళాశాలలను నెట్టుకొస్తున్న పరిస్థితి ఉంది. సరిపడ అధ్యాపకులు కాలేజీల్లో లేకపోవడంతో అడ్మిషన్లు తీసుకునేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు ఇష్టపడంలేదు. పేరున్న మంచి కాలేజీల్లో సీట్లు నిండితున్నా మిగతా కాలేజీల్లో అయితే నిండడం కష్టంగానే మారింది. ఈ ఏడాది కాలేజీల్లో సీట్లు అంతంత మాత్రంగానే నిండాయి. ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో దాదాపు 90 వేల సీట్లుంటే 51 వేల అడ్మిషన్లు మాత్రమే నిండాయి.సిబ్బంది కొరత, సరైన వసతుల్లేకపోవడంతో ఇంటర్ తర్వాత చాలా మంది విద్యార్థులు ప్రైవేట్ డిగ్రీ కాలేజీల్లోనే చేరుతున్నారు. ప్రైవేట్ కాలేజీల్లో దాదాపు 1.22 లక్షల మంది చదువుతున్నారు. ప్రైవేట్ వైపు విద్యార్థులు మళ్లకుండా ఉండాలంటే ప్రభుత్వం అధ్యాపక పోస్టులను భర్తీ చేయడంతోపాటు కాలేజీల్లో ల్యాబ్‌లు, ఇతర వసతులను కల్పించాలని విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు.

### అనుచరుడి చాయి దుకాణం ప్రారంభించిన మంత్రి..

మక్తల్: నేడు ఉదయం మంత్రి వాకిటి శ్రీహరి అనుచరుని చాయి దుకాణం ప్రారంభించారు. వాకిటి మాట్లాడుతూ.. మంత్రిగా ప్రారంభించింది చిన్నదే అయిన ఒకరికి ఉపాధి కల్పించాలన్న తృప్తి ఉందన్నారు. తనను నమ్ముకుని తన చేతి కింద పని చేసిన వారందరికీ ఉపాధి కల్పించడంలో భాగంగా ఎప్పుడు రద్దుగా ఉండే బస్టాండ్ ఏరియాలో నారాయణ పేట ఆర్టీసీడిఎంతో మాట్లాడి.. బస్టాండ్ ముందు నెలవారి కిరాయి బేస్ మీద టీ కొట్టును సాగించేలా అధికారికంగా ఉ త్తర్వులు తీసుకుని టీ కొట్టు ఏర్పాటు చేయడానికి ఆర్థిక సాయం చేశారు. రాజకీయంగా వెనుక తిప్పుకుని అవసరం అయిపోగానే గాలికి వదిలేసే ఈ రోజుల్లో అనుచరులకు ఉపాధి చూపించిన మంత్రి మంచితనాన్ని జనాలు మెచ్చుకుంటున్నారు.

## కలకలం రేపుతున్న ఎఫ్ స్టీన్ ఫైల్స్

న్యూఢిల్లీ, : ప్రపంచవ్యాప్తంగా ఎఫ్ స్టీన్ ఫైల్స్ ఎంతటి సంచలనం సృష్టిస్తున్నాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఈ వ్యవహారంలో వేలాది ఫోటోలు ఉన్నాయని.. ప్రపంచప్తంగా పెద్ద మనుషులుగా చలామణి అవుతున్న వ్యక్తులంతా ఇందులో ఉన్నారని అమెరికా మీడియాలో ప్రధానంగా వార్తలు వస్తున్నాయి. దీనికి తోడు మైక్రోసాఫ్ట్ అధినేత బిల్ గేట్స్ నుంచి మొదలు పెడితే.. ట్రంప్ వరకు అందరూ ఉండడంతో ఒక్కసారిగా కలకలం నెలకొంది.ఇటీవల అమెరికా మీడియాలో మైక్రోసాఫ్ట్ అధినేత బిల్ గేట్స్ ఫోటోలు దర్శనమిచ్చాయి. అతడితో పాటు కొంతమంది అమ్మాయిలు కూడా ఉన్నారు. కొన్ని ఫోటోలు అత్యంత దారుణంగా ఉన్నాయని.. అవి బయట పెడితే ఆ ప్రముఖుల అసలు గుట్టు బయటపడుతుందని చాలామంది అనుకున్నారు. అయితే ఇందులో కొంతమేర మతలబు చోటుచేసుకుంది. అంతేకాదు ట్రంప్ ఫోటోలు కూడా మాయమయ్యాయి. దీంతో తెరవెనక ఏదో జరిగి ఉ ంటుందని అందరు అనుకున్నారు. అయితే ఊహించని విధంగా సోమవారం తెల్లవారుజామున కొన్ని ఫోటోలు బయటకు రావడంతో మరోసారి కలకలం ఏర్పడింది.ఎప్ స్టీన్ వ్యవహారానికి సంబంధించిన దాదాపు 16 ఫైల్స్ మాయమైనట్టు అంతర్జాతీయ మీడియా వర్గాలు కొద్దిరోజులుగా వ్యాఖ్యానిస్తున్నాయి. అయితే వీటిలో న్యాయశాఖ సంబంధించిన వెబ్ పేజీ నుంచి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఫోటో మళ్లీ ప్రత్యక్షమైంది. కొద్ది రోజులు ఈ ఫోటో మిస్ అయినట్టు అమెరికా మీడియాలో వార్తలు వచ్చాయి.

ఈ ఫోటోకు సంబంధించి తాత్కాలికంగా రివ్యూ కోసమే తొలగించామని అమెరికా న్యాయశాఖ అధికారులు చెప్పడం గమనార్హం. అయితే ఆ ఫోటోలో ట్రంప్ తన భార్య మెల్లనియ, ఎప్ స్టీన్, అతడి స్నేహితురాలు గిస్లైన్ మాక్స్ వెల్ కనిపించారు.ట్రంప్ ఫోటో మాయం వెనక అమెరికాను ఆశాక అధికారులు స్పందించారు. ఈ వ్యవహారంలో ఉన్న యువతులకు సంబంధించిన గుర్తింపులు, ఇతర వ్యవహారాలు బయటికి రాకుండా ఉండడానికి చర్యలు తీసుకున్నామని.. దాని సమీక్ష కోసం ట్రంప్ ఫోటో బయటికి రాకుండా తొలగించామని అమెరికా న్యాయశాఖ అధికారులు పేర్కొన్నారు. అయితే ఇదంతా తాత్కాలికంగానే చేశామని.. ఈ కేసులో ఎవరైతే బాధితులుగా ఉన్నారో.. వారిని మాత్రమే తాము రక్షించడానికి దస్త్రాలలో సవరణలు చేస్తున్నామని వెల్లడించారు. ఈ వ్యవహారంలో ఎవరి వైపు తాము పక్షపాతం ప్రదర్శించడం లేదని.. సమరూపకంతోనే వ్యవహరిస్తున్నామని వెల్లడించారు.



# గ్రామీణ వికాసానికి ముప్పే

### మౌలిక సదుపాయాల కల్పనపై తీవ్ర ప్రభావం
### విబి జిఆర్ఎఎంజితో రాష్ట్రాలపైనా భారం

**అమరావతి,తెలంగాణ దిశ :**వికసిత భారత్- గ్రామీణ ఉపాధి, జీవనోపాదుల హామీ పథకం (విబి జిఆర్ఎఎంజి) బిల్లు కారణంగా గ్రామీణ వికాసానికి కూడా ముప్పు వాటిల్లుతుందన్న విమర్శలు వస్తున్నాయి. వాస్తవానికి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజిఎన్ఆర్ఇజిఎ) కారణంగా పేదలకు ఉపాధి దక్కడంతో పాటు దేశవ్యాప్తంగా గ్రామాల్లో అనేక రకాల మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయి. పల్లె సీమల విసానికి ఉపాధి చట్టం ఒక భరోసగా నిలిచింది. అయితే కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిననాటి నుంచి ఈ చట్టంపై కుట్రలు మొదలయ్యాయి. నిధులు తగ్గించడం, ఆంక్షలు పెంచుతూ రావడంతో క్రమంగా అణగారిన తరగతులు ఈ చట్టం కింద అమల్జేస్తున్న ఉపాధి పథకాలకు దూరం అవుతూవచ్చారు. ఇప్పుడు ఈ చట్టాన్ని పూర్తిగా ఎత్తివేస్తూ విబి జిఆర్ఎఎంజి బిల్లును తీసుకొచ్చారు. ఇది అమల్లోకి వస్తే పేదలకు ఉపాధి దక్కడం గగనంగా మారుతుంది. దీంతో పాటు గ్రామీణ వికాసానికి తీవ్ర అవరోధంగా మారనుంది. ప్రస్తుతం ఉపాధి హామీ చట్టంలో మెటీరియల్ కాంపోనెంట్ కింద గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల నిర్మాణం నుంచి అంగన్వాడీ, పంచాయతీ భవనాలు, పశువులకు నీటి తొట్టెలు, షెడ్డులు వంటి మౌలిక సదుపాయాల కల్పన పనులను లక్షల్లో చేపడుతున్నారు. ఈ పథకం కింద చేపట్టే పనులు ప్రతియేటా 14 లక్షల నుంచి 17 లక్షల వరకూ ఉన్నాయి. సన్నా, చిన్నకారు రైతులు ఉద్యాన పంటలు సాగుచేసుకునేందుకు ఉపాధి హామీ చట్టంలో భాగంగా మొక్కలు నాటుకోవడానికి అవసరమైన సాయం అందిస్తున్నారు. పండ్ల మొక్కలను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. వాటిని నాటేందుకు గుంతలు తవ్వడం, కర్రలు పాతడం వంటి పనులను వేతనదారులతో చేయించి ఈ పథకం కింద కూలీ చెల్లిస్తూ రైతులకు భారం లేకుండా పండ్ల మొక్కలను నాటడంతో పాటు రెండేళ్ల వరకూ వాటి పోషణకు నిధులు మంజూరు చేస్తున్నారు. కొత్త పథకంలో ఇవన్నీ సాధ్యమయ్యే పరిస్థితులు కనిపించడం లేదని విమర్శలు వస్తున్నాయి. రాష్ట్రంపై ఏటా రూ.3,500 కోట్ల వరకూ భారం కొత్తగా ప్రవేశపెట్టిన విబి జి ఆర్ఎం జి బిల్లులో కేంద్ర ప్రభుత్వం ఈశాన్య రాష్ట్రాలతోపాటు ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కాశ్మీర్‌కు మాత్రమే 90:10 నిష్పత్తిలో నిధులు కేటాయించేందుకు అంగీకరించింది. ఇతర రాష్ట్రాలకు 60:40 నిష్పత్తి ప్రకారం నిధులు మంజూరు చేయనుంది. రాష్ట్రంలో ఉపాధి హామీ పథకంలో రూ.8 వేల కోట్ల నుంచి రూ.8,500కోట్ల విలువైన పను లు చేపడుతున్నారు. దీంతో రాష్ట్రం పై ప్రతియేటా రూ.3,500 కోట్ల వరకూ ఆర్థిక భారం పడనుంది. దళిత, గిరిజనులకు మరింత దూరం కానున్న 'ఉపాధి': కేంద్రం తీసుకొచ్చిన ఆఎంజి అణగారిన ప్రజల జీవనోపాధులను తీవ్ర స్థాయిలో దెబ్బతీయనుంది. వివిధ కారణాలతో ఇప్పటికే 'ఉపాధి'కి దూరం అవుతున్న నేపథ్యంలో కొత్త చట్టం వల్ల వారికి ఉపాధి మరింత దూరం కానుంది. గ్రామీణ ప్రాంతాల్లో నివశించే దళిత, గిరిజనుల్లో అత్యధిక శాతం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో లబ్ధి పొందుతున్నారు. రాష్ట్రంలో 2014 నుంచి 2020 వరకూ ఉపాధి చట్టంలో లబ్ధి పొందుతున్న దళిత, గిరిజన కుటుంబాల సంఖ్య క్రమంగా పెరుగుతూ వచ్చింది. ఈ సమయంలో వెనుకబడిన ప్రాంతాలైన రాయలసీమ, ఉత్తరాంధ్ర తదితర ప్రాంతాల్లో వలసల సంఖ్య తగ్గడంతోపాటు, ఆయా కుటుంబాలకు కొంత ఆర్థిక వెలుసుబాటు కలిగింది. 2020-21 ఆర్థిక సంవత్సరంలో ఈ పథకంలో లబ్ధి పొందుతున్న దళిత కుటుంబాల సంఖ్య 22.58 లక్షలు ఉండగా, గిరిజన కుటుంబాల సంఖ్య 7.60 లక్షలుగా ఉంది. అనంతరం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ నిర?యాలు, ఈ పథకం అమలుకు విధించిన నిబంధనల కారణంగా ఈ సంఖ్య ఏ ఏటికాయేడు క్రమేపీ తగ్గుతూ వచ్చింది. ప్రస్తుతం ఈ పథకంలో లబ్ధి పొందుతున్న దళిత కుటుంబాల సంఖ్య 35.28 శాతం తగ్గి 14.61 లక్షలకు చేరగా, గిరిజన కుటుంబాల సంఖ్య 26 శాతం తగ్గి 5.60 లక్షలకు చేరింది. ఈ ఐదేళ్ల కాలంలో ఆయా ప్రాంతాల నుంచి ఉపాధి కోసం వేతనదా రులు వలసలు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. కేంద్ర ప్రభుత్వ ం తాజాగా తీసుకొచ్చిన వికసిత్ భారత్-గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ -గ్రామీణ్ (విబి జి ఆర్ఎం జి) పథకంలో ఈ సామాజిక తరగతులకు చెందిన కుటుం బాలు ఈ పథకానికి మరింత దూరమయ్యే అవకాశాలు కనిపిస్తు న్నాయి. ఇందుకు కారణం గతంలో కేంద్ర ప్రభుత్వం ఈ పథకంలో 90 శాతం మేర నిధులు కేటాయించి ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలిచేది. తాజాగా కేంద్రం ప్రవేశపెట్టిన పథకంలో కేంద్ర ప్రభుత్వం ఇందుకు కేటాయిస్తున్న నిధుల్లో 60 శాతం మాత్రమే చెల్లిస్తుంది. మిగిలిన మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించాల్సి వస్తుంది. రాష్ట్రంలో ఉన్న ఆర్థిక పరిస్థితి ద ృష్ట్యా 40 శాతం నిధులను ఈ పథకానికి కేటాయించడం చాలా కష్టమని విశ్లేషకులు చెబుతున్నారు.

# ప్రచారంలో నిజమెంత..?

విజయవాడ, : వైసీపీ అధినేత జగన్ అనేక మంది నాయకులను వచ్చే ఎన్నికలలో పక్కన పెట్టేస్తారని పెద్దయెత్తున ప్రచారం జరుగుతుంది. ముఖ్యంగా కొడాలి నాని, ఆర్కే రోజా, ఆళ్ల రామకృష్ణారెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, విడదల రజని ఇలా అనేక మంది నేతలకు ఈ సారి నియోజకవర్గాలను మార్చడమో... లేక పక్కన పెట్టడమో చేస్తారన్న ప్రచారం ఇటీవల కాలంలో ఎక్కువగా వినిపిస్తుంది. చాలా నియోజకవర్గాల్లో జగన్ సీనియర్ నేతలకు ప్రత్యామ్నాయంగా యువ నేతల కోసం చూస్తున్నారని అంటున్నారు. అందులో నిజమెంత అన్నది మాత్రం వైసీపీ నేతలు చెప్పకపోయినా.. 2029 ఎన్నికల్లో మాత్రం జగన్ అలాంటి సాహసం చేయకపోవచ్చన్న అభిప్రాయం మాత్రం బలంగా పార్టీ లోనే వినపడుతుంది. 2024 ఎన్నికల్లోనే మంత్రులను, ముఖ్యమైన నేతలను నియోజకవర్గాలను మార్చి జగన్ చేతులు కాల్చుకున్నారు. ఈసారి కూడా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని నగిరి నియోజకవర్గానికి, ఆళ్ల రామకృష్ణారెడ్డిని సత్తెనపల్లికి, విడదల రజనీని రేపల్లెకు పంపాలని దాదాపు డిసైడ్ అయ్యారన్న ప్రచారం ఉంది. ఇక ఆర్కే రోజాకు ఈసారి ఎక్కడా సీటు ఇవ్వకుండా అధికారంలోకి వస్తే ఎమ్మెల్సీ ఇస్తామన్న హామీ ఇస్తారంటున్నారు. ఇందులో నిజం లేదని చెబుతున్నారు. ఎందుకంటే ఇప్పటికే ఆ యా నియోజకర్గాల్లో ఆ నేతలు విపరీతంగా పార్టీ కోసం పనిచేస్తున్నారు. కొత్త నాయకత్వం వస్తే మళ్లీ రెండు గ్రూపులవుతాయి. అందువల్ల పార్టీకి తీవ్ర నష్టం వాటిల్లుతుంది. పైగా ఈ నేతల వల్ల పార్టీకి నష్టమేమీ లేదని, అటువంటి వారిని ఎందుకు తప్పిస్తారన్న ప్రశ్న ఎదురవుతుంది. వైసీపీని బద్నాం చేయడానికి కొందరు కావాలని దుష్ప్రచారం చేస్తున్నారని, వాటిని నమ్మవద్దంటూ నేతలకు వైఎస్ జగన్ ఇటీవల వారికే స్పష్టత ఇచ్చినట్లు తెలిసింది. నియోజకవర్గాల్లో కష్టపడి పనిచేయాలని, ప్రజాసమస్యలపై స్పందిస్తూ ఆందోళనకు దిగాలని జగన్ వారికి సూచించినట్లు సమాచారం. క్యాడర్ ను కూడా కాపాడుకుంటూ ప్రజల పక్షాన నిలస్తే టిక్కెట్ అదే వస్తుందని జగన్ చెబుతుండటంతో వారికి భరోసా వస్తుందట. పెద్దిరెడ్డినే తీసుకుంటే ఆయన తన నియోజకవర్గమైన పుంగనూరును వదిలపెట్టి బయటకు వచ్చే ప్రసక్తి ఉండదని చెబుతున్నారు. అలాగే కొడాలి నానిని మించిన నేత గుడివాడలో దొరకడం కూడా వైసీపీకి కష్టమే అవుతుందని, అందువల్ల జగన్ ఆ రిస్క్ ఎందుకు తీసుకుంటారన్నది పార్టీ నేతల నుంచి వినిపిస్తున్నటాక్.

# ఆరోగ్య సంరక్షణ కేవలం ఆస్పత్రి గోడలకే పరిమితం కాకూడదు

### స్టార్ హాస్పిటల్స్ ఎండీ డాక్టర్ గోపిచంద్




**కొండాపూర్,తెలంగాణ దిశ :** ఆరోగ్య సంరక్షణ కేవలం ఆసుపత్రి గోడలకే పరిమితం కాకూడదని, వ్యాధి భారాన్ని తగ్గించే విషయంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని స్టార్ హాస్పిటల్స్ ఎండీ డాక్టర్ గోపిచంద్ మన్నం అన్నారు. మంగళవారం నానక్ రాం గూడలోని దవాఖానలో 'ది 2025 రియాలిటీ చెక్' పేరిట ప్రెస్ మీట్ ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చికిత్స కేవలం దవాఖానలకే పరిమితమవ్వకూడదని, వ్యాధి భారాన్ని తగ్గించే ప్రయత్నంలో ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన బాధ్యత తీసుకోవాలన్నారు. వ్యాధి నివారణ, ముందస్తు గుర్తింపులపైనే ఆరోగ్యం ఆధారపడి ఉంటుందన్నారు. దవాఖాన వైద్య సిబ్బంది ప్రీవెంటివ్ హెల్త్‌కేర్ ఫిలాసఫీని పునరుద్ఘాటించారు. వాతావరణంలో మార్పులు, జీవన విధానాలు, ఆహారపు అలవాట్లు, జెనిటిక్ సమస్యలు, ఒత్తిడి, స్వయం చికిత్స విధానాలు అనారోగ్యానికి ప్రధాన కారణాలవుతున్నాయని, ఎప్పటికప్పుడు వైద్యుల సలహాలు, వైద్య పరీక్షలతో ఆరోగ్యాన్ని పదిలంగా కాపాడుకోగలమన్నారు. ఆరోగ్య సమస్యలు కేవలం ఒకటి, రెండు సంవత్సరాల కాలంలో రావని, దీర్ఘకాలంగా చిన్నచిన్నగా సమస్య తయారై, ఒక్కసారిగా బయటపడతాయన్నారు. 20 ఏండ్ల వయస్సు నుంచే జాగ్రత్తలు పాటించడం ఉత్తమమన్నారు. మధుమేహ వ్యాధిగ్రస్థ కుటుంబీకులు ఉంటే పిల్లలకు 10 ఏండ్ల వయస్సు నుంచే డయాబెటిక్ పరీక్షలు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు భరత్ కుమార్, గాందే శ్రీధర్, శ్రీనివాస్లి, శ్రీకాంత్ యెర్రం, రోహిణి కస్తూరి, సంతోష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# ఔను...వాళ్లిద్దరూ కలిసిపోయారా...

**కడప,తెలంగాణ దిశ :**ఆస్తులు, ఇంకా అనేక రకాల వివాదాలతో కొంతకాలంగా ఏపీ మాజీ ముఖ్యమంత్రి జగన్, ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల మధ్య పచ్చ గడ్డి వేస్తే భగ్గుమంటున్నది. రాజకీయంగా షర్మిల జగన్మోహన్ రెడ్డి మీద తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తున్నారు. వైసీపీ సోషల్ మీడియా వింగ్ కూడా షర్మిల మీద రాయడానికి వీలు లేని భాషలో ఆరోపణలు చేస్తున్నారు. జగన్, షర్మిల మధ్య ఆస్తుల వివాదాలు కొనసాగుతున్నాయి.. ఇప్పటికే షర్మిల అనేక సందర్భాలలో జగన్మోహన్ రెడ్డికి నోటీసులు పంపించారు. జగన్ కూడా అదే పని చేశారు. షర్మిల తనయుడి ఎంగేజ్మెంట్ కార్యక్రమానికి హాజరైన జగన్.. పెళ్లికి మాత్రం వెళ్ళలేదు. దీంతో వారిద్దరి మధ్య విభేదాలు మరింత పెరిగిపోయాయి. రెండు మూడు సంవత్సరాలుగా ఈ ఇద్దరి మధ్య ఉన్న దూరం అసలైన వైఎస్సార్ అభిమానులను బాధపెడుతోంది. తప్పు ఎవరిది, కారణం ఏమిటి అన్నది వేరే విషయం అయినా, ఒకప్పుడు కలిసి రాజకీయంగా ప్రయాణించిన అన్నా చెల్లెళ్లు ఇలా విడివిడిగా ఉండటం వారికి నచ్చడం లేదు. ఎప్పటికైనా ఈ కుటుంబం మళ్లీ ఒక్కటవ్వాలని, పరస్పర విభేదాలు పక్కన పెట్టాలని కోరుకునే వారు ఎక్కువగానే ఉన్నారు. సాధారణంగా "నీటి కంటే రక్తం చిక్కన" అనే మాట రాజకీయాల్లో కూడా చాలాసార్లు నిజమైంది. గతంలో తీవ్రంగా విభేదించిన రాజకీయ నేతలు, కుటుంబ సభ్యులు కాలక్రమంలో మళ్లీ కలిసిన సందర్భాలు ఉన్నాయి. ఆ కోణంలో చూస్తే జగన్, షర్మిల కూడా భవిష్యత్తులో కలిసే అవకాశం ఉందని కొందరు విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే అది ఎప్పుడు జరుగుతుందన్నది మాత్రం ఎవరూ స్పష్టంగా చెప్పలేని పరిస్థితి. ఇద్దరూ తమ తమ అభిప్రాయాల్లో గట్టి పట్టుదలతో ఉండటమే ఇందుకు కారణంగా చెబుతున్నారు. ఇటీవల ఒక యూట్యూబ్ ఇంటర్వ్యూలో కడప జిల్లాకు చెందిన వైసీపీ కీలక నేత, మాజీ ఎమ్మెల్సీ సతీష్ కుమార్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఆయన మాట్లాడుతూ జగన్‌కు తన చెల్లెలంటే ప్రత్యేక అభిమానం ఉందని, కుటుంబాన్ని ఎప్పుడూ గొప్పగా భావించే వ్యక్తి అని తెలిపారు. తాను జగన్‌ను దగ్గరగా చూశానని, ఆయన ఎప్పుడూ కావాలని తప్పులు చేసే మనిషి కాదని అన్నారు. తన అనుభవం ప్రకారం జగన్ ఇతరులకు మేలు చేయాలనే ఆలోచనతోనే పనిచేస్తారని వ్యాఖ్యానించారు. అందుకే అన్నా చెల్లెళ్లు మళ్లీ కలిసే అవకాశాన్ని కొట్టిపారేయలేమని ఆయన అభిప్రాయపడ్డారు. ఇదిలా ఉండగా షర్మిల ప్రస్తుతం ఏపీ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇటీవల ఆమె ప్రధానంగా అధికార కూటమిపైనే విమర్శలు చేస్తూ వస్తున్నారు. జగన్ గురించి కానీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గురించి కానీ ఆమె బహిరంగంగా వ్యాఖ్యలు చేయడం లేదు. ఒక రాజకీయ పార్టీ నేతగా అధికారంలో ఉన్న ప్రభుత్వాన్ని విమర్శించడం సహజమేనని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. గతంలో వైసీపీపై తీవ్ర విమర్శలు చేసిన షర్మిల ఇప్పుడు వైఖరిలో మార్పు చూపుతున్నారా అనే ప్రశ్నలు కూడా వినిపిస్తున్నాయి. మొత్తంగా చూస్తే, జగన్?షర్మిల మళ్లీ కలవాలని కోరుకునే భావన రాజకీయాల్లోనూ, ప్రజల్లోనూ ఉంది. అలాంటి పరిణామం జరిగితే అది సానుకూల మార్పుగా భావిస్తారు. ఇది సాధ్యమవుతుందా లేదా అన్నది కాలమే నిర్ణయించాలి. కానీ ఈ అంశం చర్చలో ఉండటం మాత్రం ఆ కుటుంబంపై ఉన్న అభిమానం ఎంత బలంగా ఉందో చెప్పే సంకేతంగా కనిపిస్తోంది. వీరిద్దరి మధ్య ఆగాదాన్ని పూడ్చడానికి చాలామంది ప్రయత్నాలు చేసినప్పటికీ ఉపయోగం లేకుండా పోయింది.. అయితే ఇప్పుడు షర్మిల, జగన్ కలిసిపోయారని కొంతమంది రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. జగన్మోహన్ రెడ్డి జన్మదినం.. ఈ సందర్భంగా సోదరి షర్మిల సోషల్ మీడియా వేదికగా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. దీంతో రాజకీయ విశ్లేషకులు వారిద్దరు కలిసిపోయారని ప్రచారం చేస్తున్నారు. జగన్ పుట్టినరోజు కాబట్టి.. పైగా మాజీ ముఖ్యమంత్రి కాబట్టి షర్మిల సోషల్ మీడియా వేదిక శుభాకాంక్షలు తెలియజేశారని కాంగ్రెస్ నాయకులు అంటున్నారు. వారిద్దరూ కలిసి పోలేదని.. సోదరుడు కాబట్టి.. అందులోనూ అతడి జన్మదినం కాబట్టి షర్మిల శుభాకాంక్షలు తెలియజేశారని వారు గుర్తు చేస్తున్నారు. మరోవైపు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కూడా సోషల్ మీడియా వేదికగా జగన్మోహన్ రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన ఆయురారోగ్యాలతో ఉండాలని.. ప్రజాసేవలో నిమగ్నమై ఉండాలని సోషల్ మీడియా వేదికగా పవన్ కళ్యాణ్ కోరారు.. పవన్ కళ్యాణ్, షర్మిల చేసిన ట్వీట్లు ప్రస్తుతం ఏపీ రాజకీయాలలో సంచలనంగా మారాయి. మరోవైపు వైసీపీ నాయకులు ఏపీవ్యాప్తంగా జగన్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. రక్తదానాలు.. రోగులకు ఆహారం పంపిణీ.. దుస్తుల అందజేత వంటి కార్యక్రమాలను చేస్తున్నారు.. ప్రపంచ దేశాలలో ఉన్న వైసిపి నాయకులు కూడా జగన్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. షర్మిల, పవన్ మాత్రమే కాకుండా.. ఇంకా చాలామంది రాజకీయ నాయకులు సోషల్ మీడియా వేదికగా జగన్మోహన్ రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు.

# మోదీ సాయం కోరుతున్న అండర్ వరల్డ్ డాన్ హాజీ మస్తాన్ కుమార్తె




**- ప్రధాని కల్పించుకుంటేనే తనకు న్యాయం జరుగుతుందని వేడుకోలు**
**- 12 ఏళ్లకే పెళ్లి.. 14 ఏళ్లకు అబార్షన్.. ఏళ్ల తరబడి లైంగిక హింస**
**- హాజీ మస్తాన్ ఆస్తుల కోసమే తనను వేధించారని ఆవేదన**

ముంబై : ముంబై అండర్ వరల్డ్ డాన్ హాజీ మస్తాన్ కుమార్తె హసీన్ మస్తాన్ మీర్జా తాజాగా మీడియా ముందుకు వచ్చారు. తాను ఏళ్ల తరబడి లైంగిక హింసకు గురయ్యానని, తనకు న్యాయం చేయాలని ప్రధాని నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేశారు. తన మాజీ భర్త, ఆయన కుటుంబంపై తాను చేస్తున్న న్యాయ పోరాటానికి మద్దతు ఇవ్వాలని కోరారు. డబ్బు, రాజకీయ అండ లేకపోవడం వల్ల తనకు న్యాయం జరగడంలేదని, ప్రధాని మోదీ, కేంద్ర హెూంమంత్రి అమిత్ షా జోక్యం చేసుకుంటేనే తనకు న్యాయం జరుగుతుందని అన్నారు. తన తండ్రి హాజీ మస్తాన్ ఎంతోమందికి సాయం చేశాడని, ఆయన చనిపోయాకే తనకు కష్టాలు మొదలయ్యాయని హసీన్ తెలిపారు. 12 ఏళ్ల వయసులోనే తనకు బలవంతంగా పెళ్లి చేశారని, 14 ఏళ్ల వయసులో తనకు అబార్షన్ అయిందని ఆమె చెప్పారు. తన తండ్రి చనిపోయాక ఆయన ఆస్తుల కోసం తనను వేధింపులకు గురిచేశారని మాజీ భర్త కుటుంబంపై ఆరోపణలు చేశారు. ఏళ్ల తరబడి లైంగిక హింసకు గురయ్యానని ఆవేదన వ్యక్తం చేశారు. హాజీ మస్తాన్ ఆస్తులన్నీ తమకే దక్కుతాయని తన మాజీ భర్త కుటుంబం ఆశించిందని చెప్పారు. అందుకోసమే తనపై అత్యాచారం చేశానని తన మాజీ భర్త చెప్పాడన్నారు. ఆస్తులు దక్కకపోవడంతో విడాకులు ఇచ్చి తనను నడి రోడ్డుపై వదిలేశారని, తన వద్ద డబ్బు ఏమీ లేదని హసీన్ వాపోయారు. మాజీ భర్త, ఆయన కుటుంబంపై 2013 నుంచి న్యాయపోరాటం చేస్తున్నానని హసీన్ చెప్పారు. అయితే, డబ్బు లేకపోవడంతో తన కేసు ముందుకు సాగడం లేదన్నారు. పోలీసులు కూడా తనకు ఎలాంటి సాయం చేయలేదని విమర్శించారు. పోలీసులు ఈ కేసును పక్కన పడేయకుండా ఉండేందుకు, తనకు న్యాయం జరిగేందుకు ప్రధాని మోదీ సాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం రాజకీయాల్లో ఉన్న నేతలు చాలామంది తనకు తెలుసని, అయితే రాజకీయాల్లోకి వచ్చే ఉద్దేశం తనకు లేదని హసీన్ స్పష్టం చేశారు. ఉత్తరప్రదేశ్ లో యోగి ఆదిత్యనాథ్ బుల్డోజర్ జస్టిస్ పై హసీన్ పొగడ్తలు కురిపించారు. యోగి బుల్డోజర్లు ముంబైకి కూడా రావాలని ఆమె ఆకాంక్షించారు.

# రెండో బిడ్డ ఉంటే ప్రభుత్వ ప్రోత్సహకం

**విజయవాడ,తెలంగాణ దిశ :**ఆంధ్రప్రదేశ్ లో చంద్రబాబు ప్రభుత్వం త్వరలో కీలక నిర్ణయం తీసుకునే అవకాశముంది. ఆంధ్రప్రదేశ్ లో ఇకపై రెండో శిశువుకు జన్మనిస్తే ప్రోత్సాహకాలు ఇవ్వాలని చంద్రబాబు ప్రభుత్వం యోచిస్తుంది. ఆంధ్రప్రదేశ్ లో జనాభా తగ్గుతుండటంతో ఈ రకమైన నిర్ణయాన్ని త్వరలోనే చంద్రబాబు తీసుకుంటారని పెద్దయెత్తున ప్రచారం జరుగుతుంది. దేశంలోనే కాదు.. ఏపీలోనూ అందులో దక్షిణాది రాష్ట్రాల్లో గత కొన్నిరోజులుగా జనాభా సంఖ్య తగ్గుతూ వస్తుంది. దీంతో ఏపీ ప్రభుత్వం రెండో బిడ్డను కంటే ప్రోత్సాహకాలు ఇచ్చే యోచనలో ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి. అలాగే ఆంధ్రప్రదేశ్ లో వృద్ధుల జనాభా పెరగడంతో పాటు సంతానోత్పత్తి రేటు తగ్గుదల ఆందోళన కలిగిస్తుంది. ఇదే విషయాన్ని చంద్రబాబు పదే పదే అనేక బహిరంగ సభల్లో ప్రస్తావిస్తున్నారు. ప్రతి వారు ఇద్దరు లేదా ముగ్గురు సంతానాన్ని కలిగి ఉండాలని చెబుతూ వస్తున్నారు. అయితే పెరుగుతున్న ఖర్చులు, ఆర్థిక భారం దృష్ట్యా చాలా మంది సింగిల్ శిశువుకే పరిమితమవుతున్నారు. దీంతో పాటు సంతాన సాఫల్యత పెంచేందుకు ప్రభుత్వ ఆధ్వర్యంలో ఫెర్టిలిటీ సెంటర్లను కూడా ఏర్పాటు చేయాలన్న ఉద్దేశ్యంలో ఉన్నట్లు ప్రచారం సాగుతుంది. జనాభా నియంత్రణ నుంచి జనాభా సుస్థిరత వైపు ప్రభుత్వ పాలసీని మార్చుకుని చంద్రబాబు ఆ దిశగా త్వరలోనే కీలక ప్రకటన చేయనున్నారని తెలిసింది. ఆంధ్రప్రదేశ్‌లో జనాభా సంక్షోభం ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. రాష్ట్రంలో సంతానోత్పత్తి రేటు ఆందోళనకరంగా పడిపోవడంతో, భవిష్యత్తులో తలెత్తే తీవ్ర పరిణామాలను నివారించేందుకు ప్రభుత్వం కీలక చర్యలకు సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా ఫ్రాన్స్, హంగేరీ వంటి దేశాల్లో అమలు చేస్తున్న తరహాలో 'రెండో బిడ్డను కనేవారికి' ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించే ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్లు ఓ అధికారి వెల్లడించారు. ఇటీవల అమరావతిలో జరిగిన 5వ కలెక్టర్ల సదస్సులో ఈ ఆందోళనకరమైన గణాంకాలను రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్ బయటపెట్టారు. జాతీయ సగటు 28.4 ఏళ్లతో పోలిస్తే, ఏపీలో సగటు వయసు 32.5 ఏళ్లుగా ఉందని, ఇది రాష్ట్రం వేగంగా వృద్ధాప్యం వైపు వెళ్తోందనడానికి సంకేతమని ఆయన వివరించారు. రాష్ట్రంలో సంతానోత్పత్తి రేటు 1.5కు పడిపోయిందని, ఇది సాధారణంగా ఉండాల్సిన 2.1 కంటే చాలా తక్కువని తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ. పనిచేయని వయసు జనాభా పెరుగుతోంది. ఇకపై పిల్లల్ని కనేలా కుటుంబాలను ప్రోత్సహించడంపైనే మన దృష్టి పెట్టాలనడం దీనిని సూచిస్తుంది

# మహేష్-రాజమౌళి సినిమాలో సరికొత్త టెక్నాలజీ..?





దిగ్గజ దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి, సూపర్ స్టార్ మహేశ్ బాబు కాంబోలో ఒక సినిమా తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. SSMB%29 అనే వర్కింగ్ టైటిల్‌తో రాబోతున్న ఈ ప్రాజెక్ట్‌ను దుర్గా ఆర్ట్స్ బ్యానర్‌పై కె.ఎల్. నారాయణ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. మహేశ్ – రాజమౌళి కాంబోలో ఫస్ట్ మూవీ కావడంతో భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్‌ని ఈ ఏడాది నవంబర్‌లో విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించిన విషయం తెలిసిందే. గ్లోబ్ ట్రాటర్‌ని పరిచయం చేయబోతున్నట్లు తెలిపింది. అయితే ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం నుంచి ఒక సాలిడ్ వార్త ప్రస్తుతం వైరల్‌గా మారింది. ఈ సినిమాలో రాజమౌళి బ్లూ–స్క్రీన్ టెక్నాలజీని ఉపయోగించబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. మొదట ఈ సినిమా షూటింగ్‌ను కెన్యాలోని నేషనల్ పార్క్‌లలో చేయాలని చిత్రబృందం ప్లాన్ చేసుకున్న విషయం తెలిసిందే. ఇందుకోసం రాజమౌళి కూడా అక్కడి లోకేషన్‌లను జల్లెడ పట్టి వచ్చాడు. అయితే ప్రస్తుతం కెన్యాలో నెలకొన్న రాజకీయ ఉద్రిక్తతల కారణంగా ఈ ప్లాన్ మారినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం, రాజమౌళి కెన్యాకు బదులుగా టాంజానియాలోని సెరెంగెటి అడవుల్లో షూటింగ్ చేయాలని నిర్ణయించుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. మరోవైపు ఈ చిత్రంలో బ్లూ–స్క్రీన్ టెక్నాలజీని ఉపయోగించి ఆఫ్రికా అడవులను గ్రాఫిక్స్ ద్వారా రూపొందించబోతున్నట్లు సమాచారం. అయితే ఈ రెండు విషయాలపై చిత్రబృందం క్లారిటీ ఇవ్వాల్సి ఉంది.

# రష్మిక మందన్నా మైసా టీంతో ప్రభాస్ కల్కి 2898 ఏడీ స్టంట్ మాస్టర్






పుష్ప ఫ్రాంచైజీతో పాన్ ఇండియా స్థాయిలో సూపర్ స్టార్ డమ్ సంపాదించింది కన్నడ హీరోయిన్ రష్మిక మందన్నా. ఈ భామ లీడ్ రోల్‌లో నటిస్తున్న మరో పాన్ ఇండియా చిత్రం మైసా. ఈ మూవీకి సంబంధించిన ఆసక్తికర వార్త ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. తాజా టాక్ ప్రకారం ఈ చిత్రానికి ప్రభాస్ కల్కి 2898 ఏడీ ప్రాజెక్ట్‌కు పనిచేసిన ఆండీ లాంగ్ గ్యుయెన్ స్టంట్ మాస్టర్‌గా పని చేస్తున్నాడు. అంతేకాదు యాక్షన్ బ్లాక్స్‌పై పనిచేసేందుకు ఇప్పటికే ఆండీ లాంగ్ గ్యుయెన్ టీం కేరళలో ల్యాండింగ్ కూడా అయినట్టు సమాచారం. షూటింగ్ కూడా త్వరలోనే మొదలు కానుందని ఇన్‌సైడ్ టాక్. ఈ మూవీలో పుష్ప 2 విలన్ తారక్ పొన్నప్ప కీలక పాత్రలో నటిస్తున్నాడని తెలిసిందే. రష్మిక మందన్నా సినిమాలో తారక్ పొన్నప్ప నటించడం ఇది రెండోసారి. Rawindra Pulle మైసా సినిమాతో డైరెక్టర్‌గా ఎంట్రీ ఇస్తున్నాడు. ఈ డెబ్యూ డైరెక్టర్ ఇటీవలే మైసా నుంచి రష్మిక మందన్నా అగ్రెసివ్ లుక్ విడుదల చేయగా.. గూస్‌బంప్స్ తెప్పించడం ఖాయమని చెప్పకనే చెబుతోంది. అన్‌ఫార్ములా ఫిల్మ్స్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న ఈ చిత్రానికి జేక్స్ బిజోయ్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ అందిస్తున్నాడు. శ్రీవల్లిగా డీగ్లామరస్ రోల్‌లో ఇరగదీసిన రష్మిక మందన్నాను మరి కొత్త దర్శకుడు మైసా సినిమాలో ఎలా చూపించబోతున్నాడన్నది సర్వత్రా ఆసక్తి నెలకొంది.

# వెంకటరమణ నేపథ్యమంతా విశాఖ!





విక్టరీ వెంకటేష్ కథానాయకుడిగా త్రివిక్రమ్ దర్శకత్వంలో ఓ చిత్రానికి సన్నాహాలు జరుగుతోన్న సంగతి తెలిసిందే. వెంకీ–గురూజీ మార్క్ చిత్రంగా మలుస్తున్నారు. ఫ్యామిలీ ఆడియన్స్ లో వెంకటేష్‌కున్న ఇ మేజ్ ఆధారంగానే త్రివిక్రమ్ ఫ్యామిలీ ఎంటర్ టైనింగ్ కథను రాసినట్లు వినిపిస్తుంది. 'వెంకటరమణ' అనే టైటిల్ కూడా ఫిక్స్ చేసిందని సమాచారం. ఈ కథ పూర్తిగా విశాఖపట్టణం నేపథ్యంలోనే సాగుతుందిట. విశాఖలో దిగువ మధ్య తరగతి కుటుంబంలో పుట్టి పెరిగిన ఓ 50 ఏళ్ల వ్యక్తి కథగా ఆవిష్కరిస్తున్నారట. కుటుంబ అనుంబంధాల నేపథ్యానికి త్రివిక్రమ్ మార్క్ హాస్యాన్ని జోడించి సిద్ధం చేసిన స్క్రిప్ట్ అని తెలిసింది. విశాఖ–అనకాపల్లి ప్రాంతాలతో తనకున్న అనుబంధాన్ని గురూజీ ఈ కథలో హైలైట్ చేయబోయ బోతున్నారట. త్రివిక్రమ్ అంటే బలమైన డైలాగులు...బంధాలు.. భావోద్వేగంతో కథను నడిపించ గల దిట్ట. ఇలాంటి కథలు రాయడం కొట్టిన పిండి. 'అతడు', ' అత్తారింటికి దారేది', 'సన్నాఫ్ సత్యమూర్తి', 'అఆ', 'అరవింద సమేత', 'అల వైకుంఠపురములో' లాంటి చిత్రాల్లో ఎమోషన్ పాతతే అయినా తనదైన ట్రీట్ మెంట్ తో రక్తి కట్టించారు. వాటిలో హాస్యం అంతే పండుతుంది. అలాంటి డైరెక్టర్ కి వెంకీ లాంటి కామెడీ టింజ్ ఉన్న నటుడు తోడైతే? ఎమోషన్ తో పాటు, హాస్యానికి ఛాన్స్ ఉంటుంది. వెంకటరమణనిఈ పాయింట్ ఆధారంగానే రాసినట్లు సన్నిహితుల సమాచారం. ఇప్పటికే ఇద్దరి కాంబినేషన్ లో 'మల్లీశ్వరి', 'నువ్వు నాకు నచ్చావ్' లాంటి సినిమాలు తెరకెక్కిన సంగతి తెలిసిందే. అయితే ఈ రెండింటికీ డైరెక్టర్ వేరైనా రైటర్‌గా పనిచేసింది త్రివిక్రమ్. వెంకీ శైలి..ఇమేజ్ ఆధారంగా తయారైన కథలవి. 'మల్లీశ్వరీ' కూడా వైజాగ్ నేపథ్యంలో సాగిన చిత్రమే.

# మరో తెలుగు దర్శకుడితో?




తమిళ అగ్ర హీరో సూర్య తెలుగు సినిమాలపై ఎక్కువ శ్రద్ధ చూపిస్తున్నారు. ఇప్పటికే ఆయన వెంకీ అట్లూరి దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. సితార ఎంటర్‌టైన్మెంట్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నది. దీని తర్వాత మరో తెలుగు దర్శకుడి కథకు కూడా సూర్య గ్రీన్ సిగ్నల్ ఇచ్చారట. ఆ దర్శకుడెవరో కాదు, బ్లాక్‌బస్టర్ 'గీతగోవిందం' దర్శకుడు పరశురామ్. ఇటీవలే సూర్యకు పరశురామ్ ఓ కథ వినిపించారట. సూర్యకు కూడా కథ బాగా నచ్చడంతో నటించేందుకు ఓకే చెప్పారట. ఈ చిత్రాన్ని దిల్‌రాజు నిర్మిస్తారని సమాచారం. ఇదిలా వుంటే, వెంకీ అట్లూరి సినిమా తర్వాత ఓ తమిళ సినిమాకు కమిటయ్యా రు సూర్య. ఆ సినిమా తర్వాత పరశురామ్ సినిమా చేయాలని సూర్య భావిస్తున్నారట. అయితే.. పరశురామ్ మాత్రం వెంకీ సినిమా వెంటనే తన సినిమా చేయాలని పట్టుబడుతున్నాడని తెలుస్తున్నది.

# లిప్ లాక్ సన్నివేశాలపై నిధి అగర్వాల్ క్రేజీ కామెంట్స్



కొన్ని నెలల క్రితం హీరో చిత్రంతో తెలుగు ప్రేక్షకులను అలరించిన నిధి అగర్వాల్, తాజాగా పవన్ కళ్యాణ్‌తో కలిసి 'హరిహర వీరమల్లు' చిత్రం చేసిన విషయం తెలిసిందే. ఈ చిత్రంతో తెలుగు సినిమా ప్రేక్షకులని అలరించేందుకు సిద్ధమైంది. 2022 తర్వాత నిధి నటించిన తొలి తెలుగు సినిమా హరిహర వీరమల్లు సినిమా కావడం విశేషం. ఈ సినిమాను ఏఎం రత్నం భారీ బడ్జెట్‌తో నిర్మించగా, క్రిష్ జాగర్లమూడి & జ్యోతి కృష్ణ దర్శకత్వ బాధ్యతలు నిర్వహించారు. జూలై 24న ఈ చిత్రం గ్రాండ్‌గా విడుదల కానుంది. నిధి అగర్వాల్ ఈ సినిమా కోసం ఐదేళ్లు వేచిచూసింది. ప్రస్తుతం ప్రమోషన్ కార్యక్రమాల్లో యాక్టివ్‌గా పాల్గొంటోంది. ఈ చిత్రంలో తన పాత్రకు న్యాయం చేయడానికి ఆమె భరతనాట్యం, గుర్రపు స్వారీ వంటి ప్రత్యేక శిక్షణలు తీసుకుంది. సినిమాలో ఒక ముఖ్యమైన సన్నివేశం భరతనాట్య నేపథ్యంతో ఉంటుందని, అలాగే తన పాత్రలో ఊహించని ట్విస్ట్ ఉందని నిధి వెల్లడించింది. మాస్ హీరోయిన్ కావాలని ఉంది కానీ నా హద్దులు నాకు తెలుసు అంటూ నిధి ఓ స్ట్రాంగ్ స్టేట్‌మెంట్ ఇచ్చింది. ఇటీవల జరిగిన ఓ ఇంటర్వ్యూలో నిధి అగర్వాల్ మాట్లాడుతూ, తనకు మాస్ హీరోయిన్‌గా గుర్తింపు రావాలని ఉందని చెప్పింది. అయితే యాంకర్ అడిగిన ప్రశ్నకు ఆమె సూటిగా సమాధానం ఇచ్చింది.మాస్ ఇమేజ్ రావాలంటే బికినీ, లిప్‌లాక్, ఇంటిమేట్ సన్నివేశాలుచేయాల్సి ఉంటుందికదా?" అని అడగ్గా, దానికి నిధి స్పందిస్తూ.. అలాంటివి నేను చేయను. నా హద్దులు నాకు తెలుసు. నేను తల్లిదండ్రులతో కలిసి చూడలేని సన్నివేశాల్లో నటించను. అలాంటి సన్నివేశాలు చేయకపోయినా మాస్ హీరోయిన్ అవ్వొచ్చు. కష్టపడి పనిచేస్తాను, మంచి కథలు ఎంచుకోవడానికి ప్రయత్నిస్తాను అని పేర్కొంది. నిధి అగర్వాల్ 'హరిహర వీరమల్లు' కోసం ఎంతగా కష్టపడిందో సినిమా చూస్తే అర్థమవుతుంది.

# మెడలో పాముతో ప్రియాంక చోప్రా...




అంతర్జాతీయ నటి ప్రియాంక చోప్రా తన సాహసోపేతమైన చర్యలతో ఎప్పుడూ వార్తల్లో నిలుస్తుంటారు. తాజాగా ఆమె సోషల్ మీడియాలో షేర్ చేసిన కొన్ని ఫోటోలు చూసి నెటిజన్లు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. ఒక భారీ పామును ఆభరణంలా మెడలో చుట్టుకుని ఆమె దిగిన ఫోటోలు ప్రస్తుతం ఇంటర్నెట్‌లో వైరల్‌గా మారాయి. ప్రియాంక తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో కొన్ని ఫోటోలు, ఒక వీడియోను పోస్ట్ చేశారు. తెల్లటి టాప్, డెనిమ్ జీన్స్, స్టైలిష్ బ్యాండనాతో ఉన్న ఆమె, మెడలో ఒక పెద్ద పామును వేసుకుని ఎంతో ధైర్యంగా కెమెరాకు పోజులిచ్చారు. ఆమెతో పాటు భర్త, ప్రముఖ సింగర్ నిక్ జొనాస్ కూడా ఉన్నారు. ప్రియాంక పాముతో చాలా సౌకర్యంగా కనిపించినప్పటికీ, నిక్ జొనాస్ ముఖంలో మాత్రం కాస్త భయం, అసౌకర్యం స్పష్టంగా కనిపించాయి.

ఈ పోస్ట్‌లోని ఒక వీడియోలో నిక్ జొనాస్.. "బేబ్, నీ కొత్త జ్యువెలరీ చాలా బాగుంది" అని అనగా, ప్రియాంక తనదైన శైలిలో స్పందిస్తూ, "థ్యాంక్స్, ఇదే నా కొత్త సెర్పెంటి (పాము ఆకారంలో ఉండే ఆభరణం)" అని బదులిచ్చారు. ఈ పోస్ట్‌తో పాటు, గతంలో తాను పాములతో దిగిన పాత ఫోటోలను కూడా ఆమె పంచుకున్నారు. అందులో ఒకటి 2011లో వచ్చిన '7 ఖూన్ మాఫ్' సినిమాలోనిది కాగా, మరొక ఫోటోలో నాగుపామును చేతితో పట్టుకుని కనిపించారు. తాను 'ది జంగిల్ బుక్' సినిమాలో 'కా' అనే పాము పాత్రకు వాయిస్ ఓవర్ ఇచ్చిన పోస్టర్‌ను కూడా జత చేశారు.

ఈ పోస్ట్‌పై నెటిజన్ల నుంచి మిశ్రమ స్పందన వస్తోంది. కొందరు ఆమె ధైర్యాన్ని మెచ్చుకుంటూ, "ది జంగిల్ బుక్‌లో మీ వాయిస్ అద్భుతం" అని కామెంట్ చేయగా, మరికొందరు నిక్ ముఖంలోని భయాన్ని చూసి నవ్వుల ఎమోజీలు పోస్ట్ చేశారు. అయితే, జంతు ప్రేమికుల నుంచి విమర్శలు కూడా వెల్లువెత్తాయి. "వినోదం కోసం జంతువులను వాడటం సరికాదు. వాటికి కూడా ప్రాణం, భావాలు ఉంటాయి. వాటి అనుమతి లేకుండా మనం వాటిని వాడుకోకూడదు. ఈ భూమిని పంచుకుంటున్న తోటి జీవులను గౌరవించడం నేర్చుకోవాలి" అంటూ ఒక యూజర్ తీవ్రంగా స్పందించారు.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. RNI. NO: TELTEL/2023/88215